

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



ఉష్ణోగ్రత (అంచనా) 27-5-2025	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	38	26
తెనాలి	37	27
నరసరావుపేట	39	25
బాపట్ల	36	27
రెంటచింతల	40	26
చీరాల	36	27

కాసుల పారుదల కనిపించడం లేదు!



మేజర్ కాలువలో పెరిగిన కంప చెట్లు



షట్టరు లేని తూము

- నిలిచిపోయిన కాల్వల మరమ్మతులు, పూడిక తీత
- ప్రభుత్వం నుంచి విడుదల కాని నిధులు
- రూ 19.28 కోట్ల ప్రతిపాదనలపై మీనమేషాలు
- బిల్లులపై నమ్మకం ఉంటే పనులు చేయండి
- చేతులెత్తేసిన జలవనరుల శాఖ అధికారులు
- పనులకు ధైర్యం చేయని సాగునీటి సంఘాలు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ కుడి కాలువ పరిధిలోని మేజర్లు.. మైనర్లు.. సబ్ మైనర్ కాలువలు అధ్వానంగా మారాయి. కాల్వల చివరి ఆయకట్టుకు పూర్తి స్థాయిలో సాగు నీటి పారుదల పరిస్థితులు కనిపించడం లేదు. విత్తు సమయం ఆసన్నమయ్యే లోగా కాల్వల్లో పూడికతీతతో పాటు అవసరమైన ప్రాంతాల్లో అత్యవసర మరమ్మతులు చేపట్టి పూర్తి చేయాల్సి ఉంది. ఈ దిశగా జలవనరుల శాఖ ఇంకా స్పందించడం లేదు. ఒక్క రూపాయి కూడా విడుదల చేయకపోవడంతో కాల్వల పనుల నిర్వహణ సందిగ్ధంలో పడింది. ఈ ఏడాదికి మరమ్మతులు లేనట్లేనా అన్న



రూపురేఖలు కోల్పోయిన మైనర్ కాలువ

ప్రశ్న అన్నదాతల నుంచి వ్యక్తమవుతోంది. నీటి సంఘాలు పనులు చేయవచ్చని ప్రభుత్వం సూచించినా.. నిర్వాహకులు ముందుకు రావడం లేదు. నిధులు మంజూరు చేయకుండా పనులు చేపట్టలేమని వారు చెబుతున్నారు.

చేతులెత్తేసిన జలవనరుల శాఖ

కాలువల మరమ్మతులు నెలాఖరులోగా పూర్తి చేయాలి.. యుద్ధ ప్రాతిపదికన కాల్వల్లో పూడిక తీత పనులు చేపట్టాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ప్రకటన చేశారు. ఇది ఆచరణలో సాధ్యం కాదనే చెప్పాలి. మరమ్మతులకు నిధులు విడుదల చేయకుండా నెలాఖరుకు పనులు ఎలా పూర్తవుతాయని రైతులు ప్రశ్నిస్తున్నారు. 'పనులు చేశాక డబ్బు వస్తుందనే ధైర్యం ఉంటే కాల్వల పనులు చేయండి. ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చే వరకు ఒక వేళ పనులు చేసినా.. మేము నమోదు చేసేది ఏమీ లేదు.' అని జలవనరుల శాఖ అధికారులు సాగునీటి సంఘాలకు చెప్పి.. చేతులేత్తేశారు. దీంతో పనులు చేసేందుకు నీటి సంఘాలు జంకుతున్నాయి.

వర్షాలతో పనులకు ఆటంకం

రుతు పవనాలు రాష్ట్రంలోకి ప్రవేశించాయి. రెండు రోజుల్లో రాష్ట్రమంతటా విస్తరిస్తాయని వాతావరణ శాఖ ప్రకటించిన నేపథ్యంలో కాలువల పనుల నిర్వహణకు ఆటంకం ఏర్పడే పరిస్థితులు ఉన్నాయి. ఇప్పటికే పనుల విషయంలో కాలయాపన జరిగింది. ఇప్పటికైనా ప్రభుత్వం నిధులు విడుదల చేసి పనులు చేపట్టేందుకు తక్షణమే చర్యలు చేపట్టాలని అన్నదాతల మొర ఆలకించే పరిస్థితి కానరావడం లేదు.

ప్రతిపాదనలకు స్పందన లేదు

కాలువల్లో చేపట్టాల్సిన అత్యవసర పనులు గుర్తించిన జలవనరుల శాఖ ప్రభుత్వానికి రూ 19.28 కోట్లు వ్యయం అంచనాలతో ప్రతి పాదనలు పంపింది. నిధుల విడుదలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వకపోవడంతో పనుల నిర్వహణ సందిగ్ధంలో పడింది. వైసీపీ పాలనలో ఐదేళ్ల కాల్వల మరమ్మతులు చేపట్టక వాటిని అధ్వానంగా మార్చేసింది. కాల్వల్లో కంప చెట్లు పెద్ద ఎత్తున పెరిగాయి. జమ్ము, తూటు కాడ, రబ్బరు మొక్కలు నిండా అల్లుకుపోయాయి. డ్రాపులు పగిలిపోయాయి. షట్టర్లు కూడా దెబ్బతిన్నాయి, కాల్వలకు నీరు విడుదల చేసేందుకు షట్టర్లు లేవు. దీంతో సాగు నీరు వృథాగా వాగుల్లో పారుతోంది.

355 పనులు.. రూ.19.28 కోట్లు

వినుకొండ, లింగంగుంట్ల, సత్తెనపల్లి, మాచర్ల డివిజన్‌లలో అత్యవసర మరమ్మతులకు సంబంధించి 355 పనులను గుర్తించారు. ఈ పనులు చేపట్టేందుకు రూ 19.28 కోట్లు వ్యయం అంచనా వేశారు. మాచర్ల నియోజకవర్గ పరిధిలోని కాలువల మర్మతులకు సంబంధించి 38 పనులు గుర్తించారు. ఈ పనుల నిర్వహణకు రూ.2.17 కోట్లు వ్యయం అంచనా రూపొందించారు. గురజాల నియోజకవర్గం పరిధిలో 31 పనులకు రూ.2.17 కోట్లు, సత్తెనపల్లి నియోజకవర్గంలో 46 పనులకు రూ.2.34 కోట్లు, పెదకూరపాడు నియోజకవర్గంలో 36 పనులకు రూ.2.16 కోట్లు, తాడికొండ నియోజకవర్గంలో 34 పనులకు రూ.2 కోట్లు, నరసరావుపేట నియోజకవర్గంలో 51 పనులకు రూ.2.30 కోట్లు, చిలకలూరిపేట నియోజకవర్గంలో 29 పనులకు రూ.1.45 కోట్లు, ప్రత్తిపాడు నియోజకవర్గంలో 25 పనులకు రూ.1.49 కోట్లు, వినుకొండ నియోజకవర్గం పరిధిలో 54 పనులకు రూ.2.70 కోట్లు, దర్శి నియోజకవర్గంలో 5 పనులకు రూ.20.48 లక్షలు, అద్దంకి నియోజకవర్గం పరిధిలో 6 పనులకు రూ.26.56 లక్షలుగా అంచనా రూపొందించారు. ఈ మేరకు జలవనరుల శాఖ నిధులు విడుదల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది.

వర్రీ తీరింది!

- రబీ ధాన్యం సేకరణలో లక్ష్యం పూర్తి
- అదనంగా 25 వేల టన్నులకు ప్రభుత్వం అనుమతి
- రైతుల ఖాతాల్లో రూ.62 కోట్లు జమ
- కొత్తగొల్లపాలెం రైతులకూ త్వరలోనే ధాన్యం డబ్బులు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో రికార్డు స్థాయిలో 92 వేల టన్నుల ధాన్యాన్ని మద్దతు ధరకు సేకరించిన ప్రభుత్వం.. రబీలోనూ రైతులకు మేలు చేసేలా అడుగులేస్తోంది. రబీ సీజన్‌కు గాను తొలుత 30 వేల టన్నుల ధాన్యం సేకరణకు ప్రభుత్వం అనుమతిచ్చింది. దీనికి సంబంధించి లేట్ ఖరీఫ్ దిగుబడులే దాదాపు 42 వేల మెట్రిక్ టన్నులు ఉన్నాయని, సేకరణ లక్ష్యం పెంచాలనే డిమాండ్లు రైతుల నుంచి పెద్ద ఎత్తున వచ్చాయి. క్షేత్రస్థాయి పరిస్థితులకు అనుగుణంగా అధికారులు కూడా అనుమతుల కోసం ఉన్నతాధికారులకు నివేదించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం 30 వేల టన్నుల ధాన్యం సేకరణ.. ఈ నెల 21 కే పూర్తయింది. అదే సమయానికి అదనంగా మరో 25 వేల టన్నుల ధాన్యం సేకరణకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో రైతాంగం ఊపిరి పీల్చుకుంది. ఇప్పటికి మొత్తం 33,250 టన్నుల ధాన్యాన్ని సివిల్ సప్లయీస్ విభాగం సేకరించింది. 5,330 మంది రైతుల ఖాతాల్లో రూ.62 కోట్లను ప్రభుత్వం జమ చేసింది.



ధాన్యాన్ని మిల్లులకు తరలిస్తున్న నగరం మండల పరిధిలోని రైతులు (ఫైల్ ఫొటో)

కొత్తగొల్లపాలెం రైతులకు న్యాయం చేసేందుకు..

ధాన్యం కొనుగోళ్లు పారదర్శకంగా జరపడానికి ప్రభుత్వం జీపీఎస్ నిబంధనను తప్పనిసరి చేసిన సంగతి తెలిసిందే. ఈ నిబంధన పాటించకుండా దాదాపు 2,800 బస్తాల ధాన్యాన్ని కొత్తగొల్లపాలెం రైతులు ఈ ఏడాది మార్చి 30న హడావిడిగా నేరుగా మిల్లులకు తరలించారు. దీంతో వారికి డబ్బులు జమ కావడం విషయంలో జాప్యం జరుగుతూ వస్తోంది. దీనిని ప్రత్యేక అంశంగా భావించి ఆ బస్తాల ధాన్యం వరకు జీపీఎస్‌కు మినహాయింపు ఇవ్వాలని సివిల్ సప్లయీస్ విభాగం ఇప్పటికే ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపింది. దీనిపై సానుకూల స్పందన వచ్చిందని త్వరలోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయని అధికారులు చెబుతున్నారు. మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లోనే రైతు ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయని చెప్పిన ప్రభుత్వం అందుకు అనుగుణంగా ఆచరణ ఉండడంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కూటమిలోకి.. కోవర్టులు





- మాచర్ల ఉదంతంతో బట్టబయలు
- పలు నియోజకవర్గాల్లో అదే పరిస్థితి
- నాడు వైసీపీలో ఉండి అరాచకాలు
- రక్షణ కోసం నేడు కూటమి పార్టీల్లోకి చొరబాటు

పల్నాడు ఎస్పీ తీరుపై టీడీపీ ఎమ్మెల్యేల ఆగ్రహం

గుంటూరు, మే 26 (ఆంధ్రజ్యోతి): తెలుగు దేశం పార్టీ అధికారంలోకి వచ్చిందన్న ఆనందం చాలా వరకూ పార్టీ శ్రేణుల్లో కనిపించడం లేదు. కూటమి పార్టీలలో వైసీపీ కోవర్టుల సంఖ్య ఎక్కువ ఉండడమే అందుకు కారణంగా తెలుస్తోంది. ఈ కోవర్టుల వ్యవహారం పార్టీకి అంకితమై పనిచేసిన కార్యకర్తలను అభద్రతా భావానికి గురిచేస్తోంది. అధికారంలో ఉన్న టీడీపీని బలహీన పరిచేందుకు వైసీపీ ఆడుతున్న కొత్త నాటకం ప్రస్ఫుటంగా కనిపిస్తున్నప్పటికీ ఏమి చేయలేని దుస్థితి ఉమ్మడి గుంటూరు జిల్లాలోని మెజారిటీ నియోజకవర్గాల్లో కనిపిస్తుంది. మాచర్ల నియోజకవర్గంలో తాజాగా జరిగిన హత్యలు.. ఆ తరువాత వెలుగులోకి వచ్చిన ఇద్దరూ ఒక పార్టీ వాళ్లే అన్న ప్రచారం కలవరాన్ని పుట్టిస్తున్నది. వాస్తవానికి హత్యకు గురయినవారు ఎప్పటి నుంచో తెలుగుదేశం పార్టీలో ఉన్నారు. హత్యకు పాల్పడిన వారు పిన్నెల్లి రామకృష్ణా రెడ్డి అనుచరులుగా ముద్ర పడిన వాళ్లే. వ్యూహాత్మకంగా వాళ్లను టీడీపీలోకి పంపి హత్యలకు ఒడిగట్టినట్లు తెలుస్తోంది. టీడీపీ బలంగా ఉన్న ప్రతి గ్రామంలోనూ ఇదే రీతిలో వైసీపీ సానుభూతి పరులను పార్టీ మారినట్లు నాటకం ఆడించి, బలహీన పర్చే కుట్రలకు తెరలేచినట్లు తెలుస్తోంది. ఒక వేళ నేరుగా టీడీపీలో చేరే అవకాశం లేకపోతే కూటమి ప్రభుత్వంలో భాగస్వాములైన జనసేన, బీజేపీల్లోకి వైసీపీ కీలక నేతలు చేరి పోతున్నారు. ఇటువంటి చేరికలవల్ల టీడీపీకి సంస్థాగతంగా కోలుకోలేని దెబ్బ తగులుతోంది. ఫ్యాక్షన్ నేపథ్యం ఉన్న పల్నాడులో కొత్త చేరికలు వల్ల టీడీపీకి పెను ప్రమాదం జరుగుతున్నట్లు తెలుస్తోంది.

అప్పుడూ వాళ్లే.. ఇప్పుడూ వాళ్లే..

గత వైసీపీ ప్రభుత్వంలో ఉమ్మడి గుంటూరులో కొందరు నేతలు భయంకరమైన అవినీతి, అక్రమాలకు పాల్పడినవారే. అదేమని ప్రశ్నించిన టీడీపీ నేతలను చాలా ఇబ్బందులకు గురిచేశారు. ఇప్పుడు అదే నేతలు కూటమి ప్రభుత్వంలోని పార్టీలలో చేరటం టీడీపీ శ్రేణులను కలవరపరుస్తోంది. అప్పట్లో భయంకరంగా దాడులు చేసి అక్రమంగా కేసులు బనాయించిన వారు ఇప్పుడు ఏమి తెలియనట్లుగా 'సేఫ్ జోన్‌'లో ఉండటం ఇబ్బందులు పడిన కార్యకర్తలను మానసిక వ్యధకు గురిచేస్తోంది. ఉదాహరణకు పొన్నూరు మాజీ ఎమ్మెల్యే కిలారు రోశయ్య గత వైసీపీ ప్రభుత్వ హయాంలో చేయని దుర్మార్గం లేదు. ప్రభుత్వాధికారాన్ని అడ్డం పెట్టుకొని మట్టిని ఇష్టానుసారంగా తవ్వి కోట్లాది రూపాయలు సంపాదించినట్లు ఆరోపణలు ఉన్నాయి. కాగా ఎన్నికల సమయంలో అన్ని ఆరోపణలు ఉన్న ఆయనకు అసలు టిక్కెట్ ఇవ్వరని చాలామంది భావించారు. వైసీపీ అధినాయకత్వం అవేవీ పట్టించుకోకుండా ఎంపీ సీటును కట్టబెట్టింది. ఎన్నికల్లో రోశయ్య ఘోరంగా ఓడిపోయారు. కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయన మీద విచారణ జరుగుతుందని అందరూ అనుకున్నారు. ఆలోపే కిలారు రోశయ్య కూటమి ప్రభుత్వంలోని భాగస్వామి అయిన జనసేనలో చేరారు. ఇప్పుడు అన్ని కేసులలో తప్పించుకొని దర్జాగా తిరుగుతున్నారు. తాజాగా జరిగిన మినీ మహానాడులో కూడా పొన్నూరు ఎమ్మెల్యే నరేంద్ర అదే అంశంపై ఆందోళన వ్యక్తంచేశారు. వాస్తవానికి కూటమి పార్టీలలో ఎవరినైనా చేర్చు కొనే విషయంలో మిగిలిన పార్టీల అభిప్రాయంతో పనిలేకుండానే జరుగుతుండటం ఇబ్బందికరంగా మారింది.

పల్నాడు ఎస్పీ తీరుపై విమర్శలు

పల్నాడు జిల్లాలోని ఎస్పీ తీరు చూస్తుంటే అధికారంలో ఏ పార్టీ ఉందో అర్థం కాకుండా ఉంది. ఎస్పీ పూర్తిగా వైసీపీకి కొమ్ము కాస్తున్నారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. వైసీపీ వాళ్లకు ఏదైనా జరిగిందంటే తీవ్రంగా స్పందిస్తున్న ఎస్పీ, టీడీపీ వాళ్ళ విషయంలో మాత్రం పట్టీ పట్టనట్టు ఉంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పైగా జంట హత్యలు జరిగిన వెంటనే టీడీపీలో అంతర్గత విభేదాలవల్లే హత్యలు అని పలనాడు ఎస్పీ ప్రకటించడం కూడా వివాదాస్పదమైంది. ఆ తరువాత జరిపిన దర్యాప్తులో పిన్నెల్లి సోదరుల పాత్ర కూడా ఉందని నిర్ధారణ కావటం వారిపై కూడా కేసు నమోదు అయింది. దీంతో ఎస్పీ తొలుత చేసిన ప్రకటన వైసీపీ నేతలకు అస్త్రంగా మారింది. ఈ నేపథ్యంలో ఎస్పీ పై పలువురు సీనియర్ ఎమ్మెల్యేలు అధిష్టానానికి ఫిర్యాదు చేశారు.

పసుపు దండు కదిలింది!

- నేటి నుంచి మూడు రోజుల పాటు కడప వేదికగా టీడీపీ మహానాడు
- జిల్లా నుంచి భారీగా తరలివెళ్తున్న టీడీపీ శ్రేణులు
- మంత్రులు అనగాని, గొట్టిపాటికి కీలక బాధ్యతలు
- దాదాపు 500కార్లు, స్వచ్ఛందంగా వెళ్లే వారూ భారీగానే
- రూ.10లక్షల విరాళం అందజేసిన ఎమ్మెల్యే వేగేశన

(బాపట్ల, ఆంధ్రజ్యోతి): మహానాడు నిర్వహణ తెలుగుదేశం పార్టీ శ్రేణులకు ఓ పండుగ లాంటిది. అధికారంలో ఉన్నా.. ప్రతిపక్షంలో ఉన్నా సంబరంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. గతేడాది ఇదే సమయానికి అంతటా ఎన్నికల వాతావరణం ఉండడంతో మహానాడు నిర్వహించడం వీలుపడలేదు. భారీ మెజారిటీతో ప్రజలు అధికారాన్ని ఇవ్వడంతో టీడీపీ నేతలు, శ్రేణుల కష్టానికి ఫలితం దక్కినట్లయింది. గతంలో ఎప్పుడూ కూడా కడప జిల్లాలో టీడీపీ మహానాడు నిర్వహించలేదు. కానీ ఈసారి కడప అందుకు వేదికగా కావడం ప్రత్యేకమైతే.. ఈ దఫా అధికారం చేపట్టాక తొలిసారి జరుగుతున్న సంబరం కావడంతో జిల్లా నుంచి అధిక సంఖ్యలో పసుపు సైన్యం కడప బాట పట్టింది. ఈ పండుగ నిర్వహణలో భాగంగా జిల్లా నుంచి ప్రాతినిత్యం వహిస్తున్న ఇద్దరు మంత్రులతో పాటు ఎమ్మెల్యేలకు కీలక బాధ్యతలను పార్టీ అధిష్ఠానం అప్పగించింది. పార్టీలో శాశ్వత సభ్యత్వం కలిగిన వారికి మహానాడుకు సంబంధించి ప్రత్యేక ఆహ్వానాలు అందాయి.



మహానాడు కోసం రూ.10 లక్షల నగదు చెక్కును రెవెన్యూ మంత్రి అనగానికి అందజేస్తున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

మండలాల వారీగా జనసమీకరణ

టీడీపీ మహానాడుకు తరలివెళ్లే విధంగా పార్టీ శ్రేణులను సమాయత్తం చేయడానికి మండలాల వారీగా నేతలకు బాధ్యతలను ఎమ్మెల్యేలు అప్పగించారు. ఒక్కో నియోజకవర్గం నుంచి దాదాపుగా 80 కార్లలో కార్యకర్తలు తరలివెళ్లే విధంగా ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇవన్నీ కూడా మంగళవారం ఉదయమే బయల్దేరనున్నాయి. దాదాపు 5,500 మంది వరకు జిల్లా నుంచి మహానాడుకు తరలివెళ్లనున్నట్లు తెలుస్తోంది.

కీలక బాధ్యతలు.. కడపలోనే మకాం

జిల్లాకు చెందిన ఇద్దరు మంత్రులకు మహానాడు నిర్వహణలో కీలక బాధ్యతలను అప్పగించడంతో మూడు రోజుల నుంచి అక్కడే మకాం వేసి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను అత్యంత ప్రాధాన్యం కలిగిన ఆర్థిక వనరుల కమిటీకి కన్వీనర్‌గా పార్టీ అధిష్ఠానం నియమించింది. భోజనాల ఏర్పాట్ల కమిటీకి కో-కన్వీనర్, సమన్వయ కమిటీలో సభ్యుడిగా మంత్రి అనగానికి చోటు దక్కింది. మరో మంత్రి గొట్టిపాటికి జనసమీకరణ కమిటీ కన్వీనర్ పగ్గాలు అప్పగించి.. ఎమ్మెల్యే ఏలూరిని అందులో సభ్యుడిగా చేర్చింది. వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనంద్ బాబుకు తీర్మానాల కమిటీలో సభ్యుడిగా చోటు దక్కింది. బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ మహానాడుకు రూ.10 లక్షల విరాళాన్ని రెవెన్యూ మంత్రి అనగానికి సోమవారం అందజేశారు.

జిల్లాలో దాదాపు 1,500 మందిపై అక్రమ కేసులు

గడచిన ఐదేళ్లలో 1,500 మంది టీడీపీ శ్రేణులపై తప్పుడు కేసులను అప్పటి ప్రభుత్వం బనాయించింది. అప్పటి ప్రతిపక్ష నేతగా చంద్రబాబు నాయుడు అరెస్ట్ సమయంలో వివిధ రూపాలలో శాంతియుత నిరసన తెలిపిన వారిపైనే దాదాపు 850 వరకు కేసులు నమోదు చేశారు. ఇవన్నీ మహానాడులో చర్చకు రానున్నాయి.

కంపెనీలు వేగంగా బ్లాక్ బర్లీని కొనుగోలు చేసేలా చూడాలి : కలెక్టర్



కలెక్టర్ వెంకటమురళి

బాపట్ల,మే 26 (ఆంధ్రజ్యోతి): బ్లాక్ బర్లీ పొగాకు పంటను కంపెనీలు వేగంగా కొనుగోలు చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటమురళి ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం సంక్షేమ పథకాల అమలు తీరు, అభివృద్ధి కార్యక్రమాలపై జిల్లా అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. పొగాకు కొనుగోలులో సమస్యల పరిష్కారం కోసం పర్చూరులో కంట్రోల్ రూం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రైతుల కోసం టోల్‌ఫ్రీ నంబరు అందుబాటులోకి తీసుకురావాలని చెప్పారు. పొగాకు కొనుగోళ్ల తర్వాత పంట నిల్వకు అవసరమైన గోదాములు గుర్తించి, సిద్ధంగా ఉంచాలన్నారు. యోగాంధ్ర కార్యక్రమాలలో భాగంగా మంగళవారం భావపురి మందిరం ఎదురుగా ఉన్న ప్రధాన రహదారిపై జిల్లా స్థాయి కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ చెప్పారు. డీఆర్వో జి.గంగాధర్‌గౌడ్, డీఆర్డీఏ పీడీ శ్రీనివాస రావు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రికవరీ మేనేజర్ ఆత్మహత్య

● రూ.40 లక్షలు కంపెనీ సొమ్ము వాడుకున్నాడని ఆరోపణ



జక్కా శ్రీరామ్‌కుమార్ మృతదేహం

నాదెండ్ల, మే 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గణపవరం గ్రామానికి చెందిన ఫినాన్స్ కంపెనీ రికవరీ మేనేజర్ జక్కా శ్రీరామ్ కుమార్(32) సోమవారం ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయన గడిచిన రెండేళ్లుగా చిలకలూరిపేట పట్టణంలోని శ్రీరామ్ ఫినాన్స్ కంపెనీలో రికవరీ మేనేజరుగా పని చేస్తున్నాడు. అతను సుమారు రూ.40 లక్షలు కంపెనీ సొమ్ము వాడుకున్నాడన్నది యాజమాన్యం ఆరోపణ. కొంత కాలంగా సొమ్మును చెల్లించాలని యాజమాన్యం అతనిపై ఒత్తిడి చేస్తోంది. ఈ క్రమంలో గ్రామంలోని జక్కావారి వీధిలో నివాసం ఉంటున్న మేనేజర్ ఎవ్వరూ లేని సమయంలో తన ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య సింధూర, కుమార్తె రిషిక, కుమారుడు అభయ బాలాజీ ఉన్నారు. భార్య సింధూర గణపవరం గ్రామ పంచాయతీలో బిల్లు కలెక్టర్‌గా పని చేస్తున్నారు. తన భర్త శ్రీరామ్ ఫైనాన్స్ కంపెనీ ఒత్తిడి, బెదిరింపుతోనే ఆత్మహత్య చేసుకున్నాడని, ఎలాంటి సొమ్ము వాడు కోలేదని నాదెండ్ల పోలీసులకు ఆమె ఫిర్యాదు చేసింది. ఎస్‌ఐ పుల్లారావు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నారు.



నడక యాతన

గుంటూరు జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు అత్యవసర పరిస్థితిలో వచ్చే వారు నడ(ర)క యాతన పడుతున్నారు. అత్యవసర పరిస్థితిలో ఆసుపత్రికి వచ్చిన వారిని లోపలికి తీసుకువెళ్లేందుకు తగినంత మంది సహాయకులు ఇక్కడ లేరు. ఉన్న స్ట్రెక్చర్లు.. వీల్ చైర్స్ అందుబాటులో లేవు. ఫలితంగా రోగిని వెంట వచ్చిన సహాయకులు.. చేతులతో ఎత్తుకొని కష్టం మీద మోసుకొని పోవాల్సిన దుస్థితి నెలకొంది. - (ఆంధ్రజ్యోతి, గుంటూరు)

మహానాడుకు డేగల రూ.10లక్షల విరాళం



డేగల ప్రభాకర్

గుంటూరు, మే 26(ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న తెలుగుదేశం పార్టీ పసుపు పండుగ మహానాడుకు ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డేగల ప్రభాకర్ రూ.10 లక్షల విరాళమిచ్చారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆయన పార్టీ పెద్దలకు నగదు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా డేగల ప్రభాకర్ మాట్లాడుతూ కడప గడ్డపై మొదటి సారిగా జరుగుతున్న టీడీపీ మహానాడును చరిత్రలో నిలిచిపోయేలా విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. రాష్ట్ర నలుమూలల నుంచి కడప వచ్చే ప్రజలకు వసతి, భోజన ఏర్పాటులో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు జరిగినట్లు డేగల తెలిపారు.

దైవ దర్శనానికి వెళ్తూ.. మృత్యు ఒడిలోకి..

● ఆటో బోల్తా.. మహిళ మృతి



జీవరత్నం మృతదేహం

మాచర్లటౌన్, మే 26(ఆంధ్రజ్యోతి): దైవ దర్శనానికి వెళ్తూ ప్రమాదవశాత్తూ మహిళ మృతిచెందిన ఘటన ఆదివారం రాత్రి మాచర్ల పట్టణంలో జరిగింది. పల్నాడు జిల్లా పెదకూరపాడుకు చెందిన చెంబేటి జీవరత్నం(33) తన బంధువులతో కలిసి విజయపురి సౌత్‌లోని సాగరమాత ఆలయంలో నిద్ర చేసేందుకు రైలులో రాత్రి మాచర్లకు చేరుకున్నారు. రైల్వేస్టేషన్ వద్ద సుమారు పది మంది తోటి ప్రయాణికులతో కలిసి ఆటో ఎక్కింది. రాత్రి 11 గంటలకు విజయపురిసౌత్ వెళ్తుండగా పట్టణ శివారులోని ఆర్టీసీ గ్యారేజీ వద్ద వీధి కుక్కలు హఠాత్తుగా అడ్డురావడంతో వాటిని తప్పించబోయి డ్రైవర్ ఆటో సడన్ బ్రేకు వేశాడు. ఈ క్రమంలో ఆటో అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో జీవరత్నం తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందింది. మిగిలిన 9 మందికి స్వల్ప గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. జీవరత్నం మృతదేహాన్ని పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

షూటర్ ముఖేష్‌కు కాంస్య పతకం



కాంస్య పతకం సాధించిన ముఖేష్ నేలవల్లి

తాడేపల్లి (వడ్డేశ్వరం), మే 26 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం వడ్డేశ్వరంలోని కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీలో బీటెక్ సీఎస్ఐటీ 3వ సంవత్సరం చదువుతున్న విద్యార్థి ముఖేష్ నేలవల్లి. ఐఎస్ఎస్ఎఫ్ రైఫిల్ షూటింగ్ ప్రపంచ జూనియర్స్ చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం సాధించినట్లు వర్సిటీ క్రీడల డైరెక్టర్ డాక్టర్ కె.హరికిషోర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 25 మీటర్ల రాపిడ్ ఫైర్ పిస్టల్ విభాగంలో 22 పాయింట్లతో ముఖేష్ పతకం సాధించినట్లు వెల్లడించారు. ఈ నెల 24 నుండి జర్మనీలోని సుహీ షూటింగ్ రేంజ్‌లో ఈ పోటీలు జరిగాయి. ఫ్రాన్స్‌కు చెందిన థామస్ క్లెమెంట్ స్వర్ణం, పోలెండ్‌కు చెందిన విక్టర్ లూకాస్ రజత సాధించారని పేర్కొన్నారు. ముఖేష్‌ను కేఎల్‌యూ యాజమాన్యం, అధ్యాపకులు అభినందించారు.

ఉద్యోగాల పేరిట ఘరానా మోసం!

● విదేశాలకు పంపిస్తామని రూ.5 కోట్లు వసూలు

● గ్రీవెన్స్‌లో ఎస్పీకి ఫిర్యాదు చేసిన విద్యార్థులు

పిడుగురాళ్ల, మే 26 (ఆంధ్రజ్యోతి): విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని పిడుగురాళ్ల పట్టణంలోని లలిత ఇన్‌స్టిట్యూట్ యాజమాన్యం మోసం చేసిందని పలువురు విద్యార్థులు సోమవారం నరసరావుపేటలో జరిగిన గ్రీవెన్స్‌లో జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావుకు ఫిర్యాదు చేశారు. లలిత టూరిజం అండ్ హోటల్ మేనేజ్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ పేరుతో భారీగా ఉద్యోగాలు ఇప్పిస్తామని పలువురి నుండి భారీగా నగదు వసూలు చేశారని విద్యార్థులు హనుమంత మూర్తి, యశ్వంత్, జక్కం శాంతి ఎస్పీకి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. 2022-24 మధ్య కాలంలో యూరప్‌కు పంపిస్తామని ఒక్కో విద్యార్థి నుండి రూ.30లక్షల నుండి రూ.40 లక్షల వరకు నగదు వసూలు చేశారని పేర్కొన్నారు. ఉద్యోగం వచ్చిందంటూ కొందరిని మోసం చేసి ఊటీ ట్రిప్‌కు సంస్థ యాజమాన్యం పంపిస్తున్నట్లు ఎస్పీ దృష్టికి తీసుకొచ్చారు. సంస్థ యజమాని పసుమర్తి కిషోర్, అతని బంధువులు, మేనేజర్ కత్తి సునీత తమవద్ద సుమారు రూ.5 కోట్లకు పైగా వసూలు చేశారని ఎస్పీకి వివరించారు. డబ్బు చెల్లించాలని అడిగితే తమపైనే ఎస్సీ ఎట్రాసిటీ కేసు పెడతామని బెదిరిస్తున్నారని తెలిపారు.

వెబ్‌సైట్‌లో హెచ్‌ఎంల సీనియార్టీ జాబితా

● నేడు సర్టిఫికెట్ల పరిశీలనకు రావాలి:డీఈఓ

గుంటూరు (విద్య) మే 26 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యాశాఖ ఆదేశాల మేరకు ఉమ్మడి గుంటూరు జిల్లాలోని జిల్లా పరిషత్, మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సీనియార్టీ జాబితాను వెబ్‌సైట్‌లో ఉంచినట్లు డీఈఓ సివి రేణుక సోమవారం ప్రకటనలో తెలిపారు. జాబితాలోని ఉపాధ్యాయులు మంగళవారం గుంటూరులోని పాత బస్టాండ్ వద్ద ఉన్న ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో జరిగే సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరుకావాలని పేర్కొన్నారు. విద్యార్హతల ధ్రువీకరణ పత్రాలు రెండు సెట్లు, సేవా పుస్తకం తీసుకురావాలని తెలిపారు. ఇతర వివరాల కోసం www.deogngblogspot.in వెబ్‌సైట్‌లో చూసుకోవాలని పేర్కొన్నారు.

పీఎస్ హెచ్‌ఎంల సీనియార్టీ జాబితా...

ఉమ్మడి జిల్లాలో పీఎస్ హెచ్‌ఎం బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్న వారి జాబితాను(www.deogngblogspot.in) వెబ్‌సైట్‌లో ఉంచినట్లు డీఈవో సీవీ రేణుక తెలిపారు. అభ్యంతరాలు ఉంటే మంగళవారం సాయంత్రంలోగా తెలియజేయాలని పేర్కొన్నారు.

నేడు స్కూల్ అసిస్టెంట్స్ సర్టిఫికెట్ల పరిశీలన

గుంటూరు(విద్య),మే 26(ఆంధ్రజ్యోతి): గుంటూరు జోన్ 3 పరిధిలోని పాఠశాలల్లో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్స్, తత్సామాన క్యాడర్‌లో పని చేస్తున్న వారికి గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయుల ఉద్యోగోన్నతులు కల్పించేందుకు మంగళవారం సర్టిఫికెట్ల పరిశీలన నిర్వహిస్తున్నట్లు ఆర్జేడీ లింగేశ్వర రెడ్డి సోమవారం తెలిపారు. గుంటూరులోని ఆర్జేడీ కార్యాలయంలో జరిగే సర్టిఫికెట్ల పరిశీలనకు జోన్ 3 పాఠశాలల స్కూల్ అసిస్టెంట్ క్యాడర్ ఉపాధ్యాయులు హాజరుకావాలని తెలిపారు. ఇందులో సీరియల్ నంబరు 1 నుంచి 75 వరకు పేర్లు ఉన్నవారు తప్పనిసరిగా హాజరుకావాలని పేర్కొన్నారు.

చిత్తడి నేల అథారిటీకి నలుగురు
అధికారేతర సభ్యుల నియామకం

అమరావతి, మే26(ఆంధ్రజ్యోతి): స్టేట్ వెట్‌ల్యాండ్(చిత్తడి నేలల) అథారిటీకి నలుగురు అధికారేతర సభ్యులను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులిచ్చింది. స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్‌కు చెందిన చిత్తడి నేలల జీవావరణ శాస్త్ర నిపుణుడు ఆర్ రామ సుబ్రహ్మణియన్, ప్రపంచవ్యాప్త ప్రకృతి నిధి(డబ్ల్యూడబ్ల్యూఎఫ్-ఇండియా) రాష్ట్ర సంచాలకుడు ఫరీదా తంపాల్, కోయంబత్తూర్‌లోని తడిభూముల జీవావరణ విభాగం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ గోల్డిన్ క్వాడ్రోస్, డెహ్రాడూన్‌లోని అంతరించిపోతున్న జాతుల నిర్వహణ సంస్థ శాస్త్రవేత్త ఆర్ సురేష్‌కుమార్ సభ్యులుగా నియమితులయ్యారు. కాగా రాష్ట్రంలో చిత్తడి నేలల పరిరక్షణ కోసం స్టీరింగ్ కమిటీ స్థానంలో ఈ అథారిటీ ముఖ్యమంత్రి అధ్యక్షతన ఏర్పాటైంది. అధికారులతో పాటు మూడేళ్ల పదవీ కాలానికి అధికారేతర సభ్యులను ప్రభుత్వం నామినేట్ చేసింది.

బకాయిలు చెల్లించకపోతే సంక్షోభంలోకి విద్యా సంస్థలు

● ప్రైవేటు పాఠశాలల సంఘాల సమాఖ్య

అమరావతి, మే 26 (ఆంధ్రజ్యోతి): విద్యాహక్కు చట్టం కింద చేరిన విద్యార్థుల ఫీజుల బకాయిలు విడుదల చేయాలని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల సమాఖ్య ప్రభుత్వాన్ని కోరింది. లేనిపక్షంలో విద్యా సంస్థలు సంక్షోభంలో పడతాయని సోమవారం ఓ ప్రకటనలో ఆందోళన వ్యక్తంచేసింది. విద్యా హక్కు చట్టం కింద ప్రభుత్వం ప్రతిపాదించిన ఫీజులపై అభ్యంతరం వ్యక్తంచేసినట్లు తెలిపింది. ప్రైవేటు పాఠశాలలకు ఇబ్బందికరంగా ఫీజులు నిర్ణయించడం సరికాదని పేర్కొంది. ఫీజులపై అధికారుల నుంచి సరైన సమాధానం రాకపోవడంతో ప్రతిపాదిత ఫీజులను తాము ఆమోదించలేదని తెలిపింది.

పర్యాటకులపై విచక్షణ రహితంగా దాడి

● కొండవీడు కోటలో కాంట్రాక్టర్ వర్గీయుల దారుణం

● కారు అద్దాలు ధ్వంసం

● తల్లి ముందే కూతురుపై దాడి, గాయాలు

● కాళ్లు పట్టుకుని ప్రాధేయపడినా వదలని వైనం

● 112కు ఫోన్ చేసినా, యడ్లపాడు పోలీసులకు చెప్పినా కానరాని స్పందన

గుంటూరు, మే 26(ఆంధ్రజ్యోతి): పర్యాటక ప్రాంతమైన కొండవీడు కోటలో కాంట్రాక్టర్ వర్గీయులు పర్యాటకులపై విచక్షణ రహితంగాగా దాడి చేశారు. తల్లి కళ్ల ముందే 17 ఏళ్ల కూతురిని జుట్టు పట్టుకొని ఈడ్చుకుంటూ వెళ్లి అత్యంత దారుణంగా వ్యవహరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు వివరాల్లోకెళ్తే.. నగరంలోని మిర్చియార్డు రోడ్డులో గల సాయినగర్ లక్ష్మీప్రియ అనే మహిళ నివాసం ఉంటోంది. తన భర్త, కూతురు, మేనల్లుడితో కలిసి కారులో సోమవారం సాయంత్రం కొండవీడు కోటకు వెళ్లారు. అక్కడ గేటు ఎంట్రన్స్ లోనే తమ నుంచి డబ్బులు కట్టించుకున్నారని బాధితురాలు తెలిపింది. కొండపైకి వెళ్లిన తర్వాత అక్కడ సెల్ఫీ తీసుకుంటుండగా.. అక్కడ పని చేసే ఓ యువకుడు టికెట్ తీసుకోవాలని అడిగాడు. ఈ విషయమై వారి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. అనంతరం లక్ష్మీప్రియ కిందకి వస్తుండగా.. కింద టోల్గేట్ వద్ద సుమారు 25 మంది వారిపై దాడికి పాల్పడ్డారు. అక్కడి నుంచి తప్పించుకుని వస్తుండగా.. కొత్తపాలెం గ్రామంలో రోడ్డుకు అడ్డంగా వాహనాలు పెట్టి తమ కారును అటకాయించి తమపై దాడి చేశారని లక్ష్మీప్రియ తెలిపింది. కారు అద్దాలు ధ్వంసం చేశారని, కాళ్లు పట్టుకొని ప్రాధేయపడిన వదిలిపెట్టకుండా దారుణంగా కొట్టారని పేర్కొంది. తన భర్తముని కోటేశ్వరరావు రెండు చేతులు వెనక్కు విడిచి పట్టుకుని తమ కుమార్తెపై దాడి చేశారని, తనను తీవ్రంగా కొట్టారని.. వారి దాడి నుంచి ప్రాణ రక్షణ కోసం కారులో దాక్కుని డోర్లు బ్లాక్ చేసుకున్నప్పటికీ వదిలిపెట్టలేదన్నారు. దీనిపై 112కు ఫోన్ చేయగా సకాలంలో పోలీసులు స్పందించలేదన్నారు. చివరకు ఎక్కడైనా పోలీసులకు ఫిర్యాదు చేస్తే చంపేస్తామని బెదిరించారన్నారు. దీనిపై యడ్లపాడు సీఐకు ఫోన్ చేస్తే ఆయన నుంచి కూడా స్పందన రాలేదన్నారు. అదేమంటే తాము ప్రభుత్వానికి రూ.30 లక్షలు చెల్లించి కాంట్రాక్టు దక్కించుకున్నామని.. అక్కడ పనిచేసే సిబ్బందికి యూనిఫాం, ఐడెంటిటీ కార్డు లేకపోవడంతో ప్రశ్నించినందుకు దాడి తీసి కొట్టారన్నారు. దీనిపైన తాను స్థానిక ఎమ్మెల్యే ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు కార్యాలయానికి ఫోన్ చేసి ఫిర్యాదు చేశామన్నారు. యడ్లపాడు పోలీస్ స్టేషన్ లో కూడా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. తాము జనసేన పార్టీ వారమని, తమను ఏమి చేయలేరంటూ గ్రామస్తులందరూ భయభ్రాంతులకు గురి చేసి కొట్టారన్నారు. తాముకూడా జనసేన పార్టీనే అని చెప్పినప్పటికీ వినిపించుకోలేదని వాపోయారు. మంగళవారం మంగళగిరిలోని జనసేన రాష్ట్ర పార్టీ కార్యాలయం వద్ద నిరసన తెలియజేస్తామని తెలిపారు. ఈ విషయాన్ని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఎక్కడ కూడా జనసేన కార్యకర్తలు భవిష్యత్తులో ఇటువంటి దాడులు, దౌర్జన్యాలకు పాల్పడకుండా ఉండేలా పవన్ కల్యాణ్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ముందస్తు భద్రత డ్రైవ్‌లు నిర్వహించాలి

● దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్



దక్షిణ మధ్య రైల్వే జీఎం వీడియో కాన్ఫరెన్స్‌కి హాజరైన డీఆర్ఎం సుధేష్ణ సేన్

గుంటూరు, మే 26 (ఆంధ్రజ్యోతి): రాబోయే వర్షాకాలం దృష్ట్యా రైల్వే ట్రాక్‌ల వెంట ముందస్తు స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ ఆదేశించారు. సోమవారం ఆయన సికింద్రాబాద్‌లోని రైల్ నిలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా గుంటూరు డీఆర్ఎం సుధేష్ణ సేన్‌తో సమీక్షించారు. తొలుత డివిజన్ వ్యాప్తంగా వర్షాకాలం సంసిద్ధత గురించి అడిగి తెలుసుకొన్నారు. అనంతరం జీఎం మాట్లాడుతూ అనివార్య పరిస్థితులను నివారించడానికి ట్రాక్‌లు, వంతెనలు, భారీ వర్షపాతం ఉన్న ప్రదేశాలు, అన్ని కీలక విభాగాల్లో పెట్రోలింగ్ ముమ్మరం చేయాలని అధికారులను ఆదేశించారు. సిగ్నలింగ్ వ్యవస్థ మొదలైన వాటి సరైన పనితీరును నిర్ధారించాలని ఆయన డీఆర్ఎంకు సూచించారు. రైలు కార్యకలాపాలలో కఠినమైన సమన్వయం, రైళ్లను నడుపుతున్నప్పుడు అనుసరించాల్సిన అన్ని భద్రత చర్యలను నొక్కి చెప్పారు. సంఘ విద్రోహ శక్తుల కార్యకలాపాల నుంచి ట్రాక్ భద్రతను పెంపొందించేందుకు అదనపు ఆర్‌పీఎఫ్ బలగాలను, పెట్రోలింగ్ సిబ్బందిని నియమించాలన్నారు. త ద్వారా ట్రాక్ పెట్రోలింగ్ బలోపేతం చేయాలని అధికారులకు సూచించారు.

కారును ఢీకొన్న లారీ..

● నలుగురికి స్వల్పగాయాలు ● కలికివాయి ఫ్లైవోవర్‌పై ప్రమాదం

సింగరాయకొండ, మే 26 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారిపై ముందువెళ్తున్న కారును వెనుకవైపు వస్తున్న లారీ ఢీకొనడంతో నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన ప్రకాశం జిల్లా సింగరాయకొండ మండలం కలికివాయి ఫ్లైవోవర్‌పై సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. చిలకలూరిపేటకు చెందిన నిమ్మల చంద్రశేఖరరావు-రాజేశ్వరి, కాకుమాని అంజన్‌రావు-చిలకమ్మ దంపతులు తిరుమలకు వెళ్లి దైవదర్శనం చేసుకున్నారు. తిరిగి స్వగ్రామానికి బయల్దేరారు. కారు కలికివాయి ఫ్లైవోవర్ వద్దకు చేరుకునే సరికి వెనుక వైపు వస్తున్న లారీ అదుపుతప్పి ఢీకొట్టింది. దీంతో రోడ్డుపై కారు బోల్తా పడింది. అందులో ప్రయాణిస్తున్న నలుగురికి స్వల్పగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న హైవే మొబైల్ పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. కారులో ఉన్న వారిని బయటకు తీశారు. అనంతరం అక్కడికి చేరుకున్న ఎస్సై బి.మహేంద్ర హైవే అంబులెన్స్‌లో ప్రథమ చికిత్స చేయించి క్షతగాత్రులను ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. అనంతరం క్రేన్ సహాయంలో కారును పక్కను తొలగించారు. లారీని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఘటనపై కేసు నమోదుచేసినట్లు ఎస్సై తెలిపారు.



రోడ్డుపై బోల్తా కొట్టిన కారు

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.10 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	121, 129, 140
చికెన్ విత్ స్కిన్(కిలో)	228.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	238.00

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె



అర్జీలు స్వీకరించి సమస్యలు అడిగి తెలుసుకుంటున్న చీరాల డీఎస్పీ ఎండీ మోయిన్

చట్టపరిధిలో సమస్యలను పరిష్కరిస్తాం

● చీరాల డీఎస్పీ ఎండీ మోయిన్

బాపట్ల, మే 26 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కారవేదికకు వచ్చిన అర్జీలను చట్టపరిధిలో విచారించి పరిష్కరిస్తామని చీరాల డీఎస్పీ ఎండీ మోయిన్ తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వారు అర్జీల ద్వారా తమ సమస్యలను డీఎస్పీకి వివరించారు. ఎస్పీ తుషార్ డూడి ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో అర్జీలు స్వీకరించిన డీఎస్పీ మోయిన్ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. న్యాయం చేస్తామని భరోసానిచ్చారు. కుటుంబ కలహాలు, భూవివాదాలు, ఆర్థిక లావాదేవీలు, ఇతర సమస్యలపై మొత్తం 59 అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో పీజీఆర్ఎస్ సెల్ ఎస్ఐ శ్రీనివాసరావు, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సూర్యఘర్ ముఫ్త్ బిజ్లీ పథకానికి రుణాలు మంజూరు చేయాలి

● కలెక్టర్ జె.వెంకటమురళి

బాపట్ల, మే 26 (ఆంధ్రజ్యోతి) : ప్రధానమంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన పథకం అమలులో స్వయం సహాయక సంఘాలకు బ్యాంక్ రుణాలు మంజూరు చేయాలని కలెక్టర్ జె.వెంకటమురళి బ్యాంకర్‌లకు సూచించారు. కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో బ్యాంకర్‌లను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీకుటుంబాలకు రెండు కిలోవాట్స్ చొప్పున ఉచితంగా సోలార్ సిస్టమ్ ఏర్పాటు చేయటం జరుగుతుందన్నారు. వీరి ఇంటిపై సోలార్ సిస్టమ్ ఏర్పాటుకు సంబంధించి స్థలం ఇచ్చినందుకు వారికి గవర్నమెంట్ కొంతమొత్తం చెల్లిస్తుందని ఆయన తెలిపారు. ఈ పథకాన్ని రాష్ట్రం మొత్తం అమలు చేసేందుకు ముఖ్యమంత్రి లక్ష్యాలను నిర్దేశించారని ఆయన చెప్పారు. జిల్లాకు 60 వేల కుటుంబాలకు సోలార్ సిస్టమ్ ఏర్పాటు చేసేందుకు నిర్దేశించారని ఆయన తెలిపారు. వీటిని 2027 సంవత్సరం నాటికి పూర్తి చేయాలని ఆయన తెలిపారు. జిల్లాలో డిసెంబరు నాటికి 47వేల కనెక్షన్‌లు ఏర్పాటు చేయాలని లక్ష్యాలను నిర్దేశించటం అయిందన్నారు. ఈసోలార్ ప్లేట్‌లు అమర్చుటకు మొత్తం 2లక్షల10వేలు ఖర్చు అవుతుందని అందులో రూ.78 వేలు సబ్సిడీ కింద వస్తుందని, లబ్ధిదారులు రూ.20 వేలు చెల్లించాలని తెలిపారు. ఇవిపోను బ్యాంకర్లు లోను కింద రూ.2 లక్షల రుణం మంజూరు చేయాలన్నారు. ఈ పథకంకు సంబంధించి ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ మొదలు పెట్టటం జరిగిందన్నారు. సమావేశంలో డిఆర్‌డిఏ పీడీ కె.శ్రీనివాసరావు, విద్యుత్ ఎస్ఇ ఆంజనేయులు, ఎల్‌డిఎమ్ శివకృష్ణ, బ్యాంక్ మేనేజర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జె.వెంకటమురళి

సీసీఆర్‌సీ కార్డుల జారీ లక్ష్యాలను పూర్తి చేసేందుకు చర్యలు

సీసీఆర్‌సీ కార్డుల జారీ లక్ష్యాలను పూర్తి చేయుటకు చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. సీసీఆర్‌సీ కార్డుల జారీ, అన్నదాత సుఖీభవ పథకాల అమలుపై రాష్ట్ర రాజధాని అమరావతి నుంచి వ్యవసాయ శాఖ ప్రధాన కార్యదర్శి బుడితి రాజశేఖర్, వ్యవసాయ శాఖ కమిషనర్ ఢిల్లీరావు, సీసీఎల్‌ఏ ప్రత్యేక కార్యదర్శి జయలక్ష్మీలు సోమవారం వీక్షణా సమావేశం ద్వారా కలెక్టర్‌కు పలు సూచనలు చేశారు. రాష్ట్రంలో సీసీఆర్‌సి కార్డుల జారీ జూన్ మాసంలోపు పూర్తి చేయాలన్నారు. జిల్లాలో గత సంవత్సరం లక్ష సీసీఆర్‌సీ కార్డులకు గాను 92వేల కుటుంబాలకు కార్డులు జారీ చేయటమైనదని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. వీరిలో 11,370 కుటుంబాలకు 55కోట్ల రుణం ఇవ్వటమైనదని తెలిపారు. ఈ సంవత్సరం ఇచ్చిన లక్ష్యాలను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో 3,41,974 మంది రైతులు ఉన్నారని తెలిపారు. 80 శాతం రికార్డులు ఆధార్‌తో అనుసంధానం చేయటమైనదన్నారు. మిగిలిన వాటిని పూర్తి చేయటానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి వై.రామకృష్ణ పాల్గొన్నారు.

తెలుగుజాతి జీవనాడి బాపట్ల

● డాక్టర్ పీసీ సాయిబాబు

బాపట్ల, మే 26 (ఆంధ్రజ్యోతి) : తెలుగుజాతి అస్థిత్వ సాధనలో బాపట్ల అద్వితీయమైన పాత్ర పోషించిందని ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి డాక్టర్ పీసీ సాయిబాబు తెలిపారు. ప్రథమాంధ్ర మహాసభ 112వ వార్షికోత్సవ కార్యక్రమం సోమవారం ఫోరం ఆధ్వర్యంలో బాపట్ల టౌన్ హాలులో నిర్వహించారు. తెలుగుతల్లి విగ్రహానికి పుష్పాంజలి ఘటించి అక్కడ జరిగిన సమావేశంలో డాక్టర్ సాయిబాబు మాట్లాడుతూ తెలుగువారికి ఒక ప్రత్యేక రాష్ట్రం కావాలనే డిమాండ్ ఇక్కడే రూపుదిద్దుకుందన్నారు. 1913లో బాపట్లలో జరిగిన ప్రథమాంధ్ర మహాసభ నాలుగు దశాబ్దాల ఆంధ్రోద్యమానికి నాంది పలికిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంజి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బి.దుర్గాప్రసాదరావు, జనవిజ్ఞాన వేదిక నాయకులు కోట వెంకటేశ్వరరెడ్డి, న్యాయవాది జమ్మీద్‌బాషా, విశ్రాంత ఆచార్యులు డాక్టర్ కె.విజయ్‌కుమార్, గురజాల శ్రీనివాసరావు, కేశవులు, పనసాల, న్యూస్ పేపర్‌క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.



తెలుగుతల్లి విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న డాక్టర్ పీసీ సాయిబాబు తదితరులు

శ్రీచెన్నకేశవస్వామి దేవస్థానం మాగాణి భూముల వేలం

పిట్టలవానిపాలెం, మే 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చందోలు గ్రామంలో ఉన్న శ్రీచెన్నకేశవస్వామి దేవస్థానానికి సంబంధించిన మాగాణి భూములకు కౌలు బహిరంగ వేలం పాట ఈనెల 28వ తేదీ ఉదయం 10 గంటలకు జరుగుతుందని త్రిముఖ దేవాలయాలకు చెందిన ఆలయాల కార్యనిర్వాహణాధికారి జి.నరసింహమూర్తి తెలిపారు. ఈ భూములకు సంబంధించి కుంచలవారిపాలెం గ్రామంలో గల సర్వే నెంబరు 391/1లో ఒక ఎకరం భూమి, చందోలు గ్రామంలో గల సర్వేనెంబరు 323/4లో ఒక ఎకరం 5 సెంట్లకు గాను మాగాణి భూములకు వేలం పాట జరుగుతుందని ఆయన చెప్పారు. ఆసక్తి కలిగిన రైతులు ముందుగా రూ.5 వేలు దరావత్తు చెల్లించి వేలంలో పాల్గొనవచ్చని తెలిపారు.

దాడులను ఆపి శాంతియుతంగా చర్చలు జరపాలి

● ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులు

బాపట్ల,మే 26 (ఆంధ్రజ్యోతి) : ఆపరేషన్ కగార్ పేరిట ఆదివాసిలపై కేంద్ర ప్రభుత్వం సాగిస్తున్న దమనకాండను వెంటనే ఆపివేయాలని, మావోయిస్టులతో శాంతియుత చర్చలు జరపాలని ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. బాపట్ల అంబేద్కర్ సర్కిల్‌లో ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలని, నక్సలైట్లతో శాంతియుత చర్చలు జరపాలని ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో సోమవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసి ఉమ్మడి జిల్లా సహాయ కార్యదర్శి మేకల ప్రసాద్, నల్లమడ రైతు సంఘం నాయకులు కె.విజయ్‌కుమార్, సీపీఎం బాపట్ల కమిటీ నాయకులు శరత్, కొచ్చెర వినయ్‌రాజు, డాక్టర్ గుదే రాజారావు, సీపీఎం నాయకులు పి.కొండయ్య, ప్రగతిశీల మహిళా సంఘం డివిజన్ కార్యదర్శి మువ్వల పల్లవి, కేశవులు, ఎం.రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

● కలెక్టర్ జె.వెంకటమురళి

● పీజీఆర్ఎస్‌కు 177 అర్జీలు



అర్జీదారుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ జె.వెంకటమురళి

బాపట్ల, మే 26 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కారవేదికలో నమోదయ్యే అర్జీలను అధికారులు తక్షణమే పరిష్కరించాలని కలెక్టర్ జె.వెంకటమురళి ఆదేశించారు. పీజీఆర్ఎస్ కార్యక్రమం సోమవారం కలెక్టరేట్‌లో జరిగింది. సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా నలుమూలల నుంచి వచ్చిన 177 మంది బాధితులు కలెక్టర్‌కు అర్జీల ద్వారా సమస్యలను వివరించారు. వాటిలో కొన్నిటికి తక్షణమే పరిష్కారమార్గం చూపించారు. కొన్నిటికి పరిశీలన, మరికొన్నిటిని విచారణ నిమిత్తం అధికారులను ఆదేశించారు. తన పరిధిలో లేని వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామన్నారు. అర్జీల పరిష్కారంపై ప్రజల సంతృప్తి స్థాయి పెరిగేలా అధికారులు పని చేయాలని కలెక్టర్ చెప్పారు. పీజీఆర్ఎస్‌పై అధికారులు నిర్లిప్తంగా ఉండరాదన్నారు. 22ఎ కేటగిరిలో పెండింగ్‌లో ఉన్న 108 అర్జీలను తక్షణమే పరిష్కరించాలని ఆర్డీవోలకు సూచించారు. సాధారణ బదిలీలలో అధికారులు పారదర్శకత పాటించాలన్నారు. జిల్లాలో పని చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులను ఇతర జిల్లాలకు బదిలీ చేయరాదన్నారు. ఆ స్థానంలో పొరుగు జిల్లాల నుంచి అదే హోదాలో వచ్చే వారు ఉంటేనే అనుమతి కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో జి.గంగాధర్‌గౌడ్, ఉప కలెక్టర్ లవన్న, డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారవేదికకు 14 ఫిర్యాదులు

రేపల్లె, మే 26 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కార వేదికను డివిజన్‌లోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీవో రామలక్ష్మి అన్నారు. ఆర్డీవో కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు 14 ఫిర్యాదులు అందాయి. అరవపల్లి గ్రామానికి చెందిన పరుచూరి వెంకటబుచ్చియ్య చౌదరి రీసర్వేలో తనభూమి తక్కువగా నమోదైందని సర్వే చేసి సరి చేయాలని కోరారు. నల్లూరుపాలెం గ్రామానికి చెందిన అమిరినేని వెంకటేశ్వరరావు నగరం మండలం అల్లపర్రు గ్రామంలో భూమి కలదని, సదరు భూమి కోర్టు లావాదేవీలలో ఉందని ఆ భూమిని ఎవరికి ఆన్‌లైన్ చేయరాదని తెలిపారు. వేమూరు గ్రామానికి చెందిన జీ.తిరుపతమ్మ ఇంటిప్లాన్ అప్రూవల్ మంజూరు చేయాలని కోరారు. జైభీమ్ భారత్ పార్టీ తరుపున దోవరమేష్‌రాంజీ వేమూరు నియోజకవర్గపరిధిలోని శ్మశానవాటికలు లేని ఎస్టీ పల్లెలకు శ్మశాన వాటికలు నిర్మించాలని కోరారు. ఆయా అర్జీలన్నీ పరిశీలించి సంబంధిత శాఖలకు పంపి సమస్యలను త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని ఆర్డీవో తెలిపారు.



ప్రజాసమస్యల పరిష్కారవేదికలో అర్జీలను పరిశీలిస్తున్న ఆర్డీవో రామలక్ష్మి

పేదలకు నివేశన స్థలాలివ్వాలి

● సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జల్లి విల్సన్

బాపట్ల, మే 26 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు పట్టణ ప్రాంతాలలో 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతాలలో 3 సెంట్లు చొప్పున పేదలకు నివేశన స్థలాలివ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ డిమాండ్ చేశారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేదలకు నివాసయోగ్యమైన నివేశన స్థలాలివ్వాలని కోరుతూ జూన్ 2వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాలలో జరిగే ధర్నాలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సీపీఐ స్థాపించి వంద సంవత్సరాలైన సందర్భంగా ప్రతి శాఖ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలన్నారు. జూలై 9న దేశవ్యాప్తంగా సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. సీపీఐ జిల్లా కౌన్సిల్ నాయకుడు షేక్ కాలేషా, జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ, బత్తుల శామ్యూల్, ఏటగిరి శ్రీనివాసరావు, చిరమల ప్రకాష్, నంబూరి సత్యం, సైకం రాజశేఖర్, రత్నకుమారి, ముస్తఫా, మేడా వెంకట్రావు, అద్దంకి నాగేశ్వరరావు, మల్లెల ఏసోబు, మేకల వెంకాయమ్మ, దొంతిబోయన వెంకటేశ్వరరెడ్డి, మేకల బిజిలి బాబు, రమణయ్య, కె.కనకారెడ్డి, ప్రశాంతరాజు, రాజారెడ్డి, శ్రీనివాసరెడ్డి, ముత్తిరెడ్డి నాగేశ్వరరావు, మేకల రమణయ్య, పొట్లూరి అంకమ్మరావు పాల్గొన్నారు.



గ్రీన్ కార్పొరేషన్ ప్రతినిధులతో కలిసి చెరువును పరిశీలిస్తున్న కమిషనర్ రఘునాథరెడ్డి

గ్రీన్ కార్పొరేషన్ సహకారంతో రెండు పార్కులు ఏర్పాటు

● కమిషనర్ రఘునాథరెడ్డి

బాపట్ల, మే 26 (ఆంధ్రజ్యోతి) : పట్టణ సుందరీకరణలో భాగంగా ఆంధ్రప్రదేశ్ గ్రీన్ కార్పొరేషన్ సహకారంతో నూతనంగా రెండు పార్కులు ఏర్పాటు చేయనున్నట్లు కమిషనర్ జి.రఘునాథరెడ్డి తెలిపారు. సోమవారం 2వ వార్డు రామకృష్ణపురంలో ఉన్న 3.39 ఎకరాల చెరువును, కర్లపాలెం రోడ్డులోని మార్కెట్ యార్డు ఎదురు ఉన్న పురపాలక సంఘ స్థలం ఎకరం 8 సెంట్లును గ్రీన్ కార్పొరేషన్ ప్రతినిధులు శ్రీకాంత్, ప్రజ్ఞలతో కలిసి ఆయన పరిశీలించారు. స్థలాలు నిరూపయోగం కాకుండా పార్కులుగా అభివృద్ధి చేసేందుకు తగు సూచనలు చేశారు. ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ సూచనలతో త్వరలోనే అంచనాలు తయారు చేసి ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామన్నారు. త్వరలోనే రెండు నూతన పార్కులు ఏర్పాటు చేయటం జరుగుతుందన్నారు. డీఈ ఎస్ఎస్ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఎండీయూ వాహన ఆపరేటర్లను కొనసాగించాలి

బాపట్ల,మే 26 (ఆంధ్రజ్యోతి) : ఎండీయూ వాహనాలు కొనసాగించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ మజుందార్ డిమాండ్ చేశారు. ఎండీయూ వాహనాలతో సోమవారం అంబేద్కర్ సర్కిల్ దగ్గర నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా మజుందార్ మాట్లాడుతూ ఎండీయూ రేషన్ వాహనాలను కొనసాగించి వాహనదారులు, అసిస్టెంట్లకు ఉపాధి కల్పించాలన్నారు. ఈ వాహనాలు నిలిపివేస్తే 18,520 కుటుంబాలు రోడ్డున పడుతాయన్నారు. 2027 జనవరి వరకు ఒప్పందం ఉన్నప్పటికి ఉల్లంఘించి వాహనాలు ఆపివేయటం సరైన చర్యకాదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పేద ప్రజలకు ఉపయోగపడే ఈ విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ బాపట్ల పట్టణ నాయకులు కె.శరత్, ఎండీయూ వాహనాల సంఘ జిల్లా నాయకులు దారా దేవసహాయం, గోపి, పేర్ని రమేష్, మేకల రాజేష్, రాఘవ తదితరులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ జె.వెంకటమురళిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానని కలెక్టర్ తెలిపారు.

ఎస్‌డబ్ల్యూ పీసీ షెడ్‌ను తనిఖీ చేసిన డీపీవో

బాపట్లరూరల్,మే 26 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల మండలం పడమర బాపట్ల పంచాయతీ ఎస్‌డబ్ల్యూ పీసీ షెడ్‌ను సోమవారం జిల్లా పంచాయతీ అధికారి కేఎల్ ప్రభాకరరావు తనిఖీ చేశారు. వర్మీ కంపోస్ట్ తయారీ, అమ్మకాలు గురించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అదేవిధంగా గ్రామసచివాలయాన్ని తనిఖీ చేసి సచివాలయ ఉద్యోగులకు పలు సూచనలు చేశారు.



ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్‌ను పరిశీలిస్తున్న డీపీవో కేఎల్ ప్రభాకరరావు

అనుమతులు లేని భవనాలపై చర్యలు తీసుకోవాలి

బాపట్ల, మే 26 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో ఫైర్ సేఫ్టీ అనుమతులు లేకుండా నిర్మించిన భవనాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జైభీమ్‌రావు భారత పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కొచ్చెర వినయ్‌రాజు సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ జె.వెంకటమురళికి ఫిర్యాదు చేశారు. దీనిపై చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డిని కలెక్టర్ ఆదేశించారు.

ఫారెస్ట్ అధికారులపై...

సూర్యలంక సముద్రతీరంలోని ఫారెస్ట్ భూమిని అమ్ముకున్న ఫారెస్ట్ అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ జైభీమ్‌రావు భారతపార్టీ జిల్లా అధ్యక్షుడు పర్రె కోటయ్య సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ జె.వెంకటమురళికి వినతిపత్రం అందజేశారు. అదేవిధంగా ఎయిర్‌ఫోర్స్‌స్టేషన్ ఎదురుగా ఫారెస్ట్ భూమిలో ప్లాంటేషన్ చేశారని, అయితే అక్కడ మొక్కలు లేకుండా పోయాయని, దీనిపై కూడా విచారణ జరిపి చేయని పనులు చేసినట్లు చూపించిన అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కొచ్చెర వినయ్‌రాజు, ఏబేలు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శిపై కలెక్టర్‌కు ఫిర్యాదు

మండలంలోని ఈతేరు గ్రామ కార్యదర్శి ఎ.షణ్ముఖరావు తనను మోసగించి రూ.11 లక్షలు విడతల వారీగా తీసుకొని ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నాడంటూ కాకుమానుకు చెందిన ఎస్‌కె మైబూన్ సోమవారం ప్రజా సమస్యల పరిష్కారవేదికలో కలెక్టర్ జె.వెంకటమురళికి ఫిర్యాదు చేశారు. తాను అప్పు తీసుకొచ్చి కార్యదర్శికి ఇచ్చిన డబ్బులు ఇప్పుడు వడ్డీతో కలిపి రూ.18 లక్షలు అయ్యాయని ఆవేదన వ్యక్తం చేసింది. డబ్బులిప్పించి తనను ఆదుకోవాలన్నారు.

ఉద్యోగం పేరుతో మోసం చేశాడని...

బాపట్లరూరల్, ,మే 26 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగం పేరుతో నగదు తీసుకొని మోసం చేశాడంటూ కాకుమాను మండలం రేటూరు గ్రామానికి చెందిన సయ్యద్ నజ్మా అనే మహిళ సోమవారం ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కారవేదికలో వినతిపత్రం అందజేశారు. అనంతరం ఎస్పీ కార్యాలయ ఆవరణలో బాధితురాలు విలేకర్లతో మాట్లాడుతూ చినగంజాం గ్రామానికి చెందిన కొండమూడి సుబ్బారావు తన భర్తకు చీరాల ఐటీసీలో ఉద్యోగం ఇప్పిస్తానని లక్షా 50 వేల రూపాయల నగదును సుమారు 2 సంవత్సరాల క్రితం తీసుకొని ఉద్యోగం ఇప్పించకపోగా డబ్బులు అడిగితే చంపేస్తానంటూ బెదిరింపులకు పాల్పడ్డాడని తెలిపారు.

సారా విక్రయిస్తున్న ఇద్దరు అరెస్టు

బాపట్ల రూరల్, మే 26 (ఆంధ్రజ్యోతి) : నాటుసారా తయారు చేసి అమ్ముతున్న ఇద్దరు వ్యక్తులను సోమవారం వెదుళ్ళపల్లి పోలీసులు అరెస్టు చేశారు. వెదుళ్ళపల్లి ఎస్ఐ భాగ్యరాజ్ తెలిపిన వివరాలు ప్రకారం స్టూవర్టుపురం గ్రామం రెండో గ్యాంగ్‌కు చెందిన బచ్చు మహేష్, వృక్షనగర్‌కు చెందిన మానుపాటి వెంకటేష్ బోయనవారిపాలెం రోడ్డులో నాటు సారా తయారు చేసి ద్విచక్రవాహనంపై స్టూవర్టుపురం తీసుకొస్తుండగా వారిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకొని సీజ్ చేయటం జరిగిందన్నారు. ఈ మేరకు ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి కేసు నమోదు చేయటం జరిగిందని ఎస్ఐ తెలిపారు.


కారు ఢీకొని భార్యాభర్తలకు గాయాలు

బాపట్ల, మే 26 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని గడియార స్తంభం సెంటర్‌లో పోస్టాఫీస్ దగ్గర టీవీఎస్ మోపెడ్‌పై వెళుతున్న భార్యభర్తలను కారు ఢీకొట్టటంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించగా ప్రాథమిక వైద్యం చేసి మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరు ఆసుపత్రికి తరలించినట్లు సీఐ ఆర్.రాంబాబు తెలిపారు.

భర్త వేధింపులపై ఫిర్యాదు

బాపట్ల, మే 26 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని చెంగల్రాయుడు తోటకు చెందిన మౌనికకు చుండూరు మండలం మండూరు గ్రామానికి చెందిన జోసఫ్‌తో వివాహం జరిగింది. జోసఫ్ తనను వేధింపులకు గురిచేస్తున్నాడంటూ సోమవారం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు ఎస్ఐ విజయ్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

భర్తీపూడి టీడీపీ అధ్యక్షుడిగా అమరేష్



అచంట అమరేష్

బాపట్ల రూరల్, ,మే 26 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల మండలం భర్తీపూడి గ్రామ టీడీపీ అధ్యక్షుడిగా భర్తీపూడి సర్పంచ్ అచంట అమరేష్ 5వసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా వెలగపూడి గురవయ్య, ప్రధాన కార్యదర్శిగా సోమ మల్లేశ్వరరావు, కార్యదర్శులుగా శ్రీకాంత్, కొల్లి వరలక్ష్మి, సునీత, కోశాధికారి కాకుమాను సుబ్బారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గ్రామపార్టీ అధ్యక్షుడిగా ఎన్నికైన అచంట అమరేష్‌కుటీడీపీ సీనియర్ నాయకుడు ఇనగంటి గాంధీ అభినందనలు తెలిపారు.

సచివాలయం, ఆధార్ సెంటర్‌లను పరిశీలించిన ఎంపీడీవో

కర్లపాలెం, మే 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెదపలుగువారిపాలెం గ్రామ సచివాలయాన్ని సోమవారం ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగస్తులు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా కర్లపాలెం మండలం గణపవరం గ్రామంలోని ఆధార్ సెంటర్‌ను పరిశీలించి అక్కడ సిబ్బందికి తగు సూచనలు చేశారు.



తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న జువ్వలపాలెం గ్రామస్థులు

ఇసుక గోతుల్లో నివేశన స్థలాలు మంజూరు చేయవద్దని వినతి

కొల్లూరు, మే 26 (ఆంధ్రజ్యోతి) : కృష్ణానది పరివాహక ప్రాంతంలో ఇసుక గోతులలో నివేశన స్థలాలు మంజూరు చేయరాదని జువ్వలపాలెం గ్రామస్థులు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతి పత్రం అందించారు. సోమవారం మండల పరిధిలోని జువ్వలపాలెం గ్రామవాసులు రెవెన్యూ కార్యాలయంలో గ్రీవెన్స్‌లో ఉన్న తహసీల్దార్ బి.వెంకటేశ్వర్లును కలుసుకుని తమ గ్రామ పరిధిలో పేదలకు నివాస స్థలాలు కేటాయిస్తున్నట్లు తమకు సమాచారం అందిందని, స్థలాల కేటాయింపునకు ఎంచుకున్న భూములు ఇసుక గోతులు అని కృష్ణానదికి వరదలు వచ్చిన సందర్భాల్లో ఆ ప్రాంతం మొత్తం పూర్తిగా నీటితో నిండిపోతుందని తెలియజేశారు. అంతేకాకుండా గతంలో ప్రభుత్వం నుంచి పట్టాలు పొంది వాటిని విక్రయించుకుని మళ్లీ ఆర్ అండ్ బీ రోడ్డుపై అక్రమంగా గృహాలు ఏర్పాటు చేసుకుని నివసిస్తున్నారని, స్థలాల కేటాయింపు గతంలో ప్రభుత్వ స్థలాలు పొందిన వారికి మినహాయించి అర్హులైన వారికి మాత్రమే స్థలాలు కేటాయించాలని, అలాగే ఆర్ అండ్ బీ రోడ్డుపై అక్రమ నిర్మాణాలను తొలగించి డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధి చేయాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. వినతి పత్రం అందించిన వారిలో వై.రోశిబాబు, ఎస్.నరేంద్రబాబు, రావి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పక్కన ఇళ్లను తొలగించరాదని ధర్నా

రేపల్లె, మే 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బేతపూడిరోడ్డులో తాత్కాలికంగా నివాసం ఉంటున్న కుటుంబాల ఇళ్ళు తొలగించరాదని సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ మోర్ల శ్రీనివాసరావుకు వినతిపత్రాన్ని అందించారు. సీపీఎం పట్టణ కార్యదర్శి సీహెచ్ మణిలాల్ మాట్లాడుతూ రోడ్డు మార్జిన్‌లో ఎన్నో ఏళ్ళుగా నాలుగు నిరుపేద కుటుంబాలు గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తున్నారని, అలాంటి వారిని ఉన్నపలంగా వెళ్ళమంటే ఎక్కడకు వెళ్తారని ప్రశ్నించారు. వారికి నివేశనస్థలాలు ఇప్పించాలని కోరారు. సమస్య పరిష్కరించే విధంగా చూస్తామని తహసీల్దార్ హామీనిచ్చారు. కార్యక్రమంలో బేతపూడి గ్రామ ప్రజలు, నేతలు, వి.భాస్కర్, కె.ఆశీర్వాదం, కేవీ లక్ష్మణ్‌రావు, బాబూరావు, కె.రమేష్ పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న బేతపూడి గ్రామస్తులు

చౌక దుకాణాల్లోనే రేషన్ : తహసీల్దార్

కొల్లూరు, మే 26 (ఆంధ్రజ్యోతి) : రేషన్ సరుకులు ఇకపై చౌక ధరల దుకాణాల్లోనే లభ్యం అవుతాయని, ఎండీయూ వాహనాలకు ప్రభుత్వం స్వస్తి పలికిందని తహసీల్దార్ బి.వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం మధ్యాహ్నం ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో వీఆర్వోలు, రేషన్ డీలర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, జూన్ 1వ తేదీ నుంచి లబ్ధిదారులకు రేషన్ దుకాణాల్లోనే నిత్యవసర సరుకులు పంపిణీ చేయాలని సూచించారు. ఎండీయూ ఆపరేటర్ల వద్ద ఉన్న ఈ-పోస్ మిషన్లను రేషన్ డీలర్లకు అప్పగించాల్సిన బాధ్యత వీఆర్వోలకు అప్పగించినట్లు చెప్పారు. ప్రతి నెలా 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 8 గంటల వరకు మాత్రమే రేషన్ పంపిణీ జరుగుతుందన్నారు. లబ్దిదారులు ఇకపై నేరుగా రేషన్ దుకాణాలకు వెళ్లి నిత్యవసరాలు తీసుకోవాలని సూచించారు. డీలర్లు తమ దుకాణాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ సమావేశంలో సీఎస్‌డీటీ ఫణికుమార్, డీటీ శ్రీనివాసరావు, జూనియర్ అసిస్టెంట్ తేజ, వీఆర్వోలు, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకటేశ్వర్లు

కొల్లూరు ఎస్ఐగా జానకి అమరవర్ధన్



ఎస్ఐ జానకి అమరవర్ధన్

కొల్లూరు, మే 26 (ఆంధ్రజ్యోతి) : కొల్లూరు ఎస్ఐగా జానకి అమరవర్ధన్ బాధ్యతలు చేపట్టనున్నారు. కొల్లూరు ఎస్ఐగా విధులు నిర్వహించిన జి.ఏడుకొండలు నెల రోజుల క్రితం వీఆర్‌కు బదిలీ అయ్యారు. ఆ స్థానంలో అమృతలూరు ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న జానకి అమరవర్ధన్ బదిలీపై కొల్లూరు రానున్నారు. బుధవారం కొల్లూరు ఎస్ఐగా బాధ్యతలు చేపట్టనున్నట్లు సమాచారం.

30న శిఖరేశ్వరస్వామి ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ

చెరుకుపల్లి, మే 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నడింపల్లి గ్రామంలోని శిఖరేశ్వరస్వామి వారి ఆలయంలో జీవధ్వజస్తంభ ప్రతిష్ఠ, నవగ్రహ మండప ప్రతిష్ఠ మహోత్సవం ఈనెల 28వ తేదీ నుంచి 30వ తేదీ వరకు జరుగుతుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈనెల 27వ తేదీన నడింపల్లి, గూడవల్లి గ్రామాలలో గ్రామోత్సవం, 28న దీక్ష స్వీకరణ, యాగశాల ప్రవేశం, 29న నవగ్రహ మండపారాధన, శాంతిహోమం, 30న యంత్రస్థాపన, ప్రాణప్రతిష్ఠ, మహా కుంభాభిషేకం జరుగుతాయన్నారు. అనంతరం అన్నసంతర్పణ జరుగుతుందన్నారు. ఈ ప్రతిష్ఠా మహోత్సవానికి భక్తులు విరివిగా విచ్చేసి కార్యక్రమంలో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

రైతుల నిరసన దీక్షకు తరలిరావాలి : డాక్టర్ కొల్లా

బాపట్ల, మే 26 (ఆంధ్రజ్యోతి) : రైతు సంఘాల సమన్వయ సమితి ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 10 గంటలకు చిలకలూరిపేట ఐటీసీ పొగాకు కంపెనీ ఎదురుగా నిరసన దీక్ష చేస్తున్నట్లు నల్లమడ రైతు సంఘం అధ్యక్షుడు డాక్టర్ కొల్లా రాజమోహనరావు తెలిపారు. నల్లబర్లి పొగాకును వెంటనే కొనాలని డిమాండ్ చేస్తూ చేపడుతున్న దీక్షకు రైతులు, రైతు నాయకులు, ప్రజలు, ప్రజాస్వామికవాదులు తరలిరావాలని ఆయన కోరారు.

అమృతలూరులో స్వచ్ఛ ఆంధ్రా.. స్వర్ణాంధ్ర

అమృతలూరు, మే 26 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం అమృతలూరులో సోమవారం స్వచ్ఛ ఆంధ్రా, స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పరిసరాల పరిశుభ్రత, స్వచ్ఛ ఆంధ్రా, స్వర్ణాంధ్ర కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శేషమాంబ, సర్పంచ్ దేవరకొండ రాము పాల్గొన్నారు.

రాజకీయ.. రక్తచరిత్ర

- గుండ్లపాడు ఫ్యాక్షన్‌లో 20 మంది మృతి
- ఆర్థికంగా నష్టపోయిన కుటుంబాలు
- ఏ ఒక్క ఘటనలోనూ శిక్ష పడని వైనం
- ఫ్యాక్షన్ ముఠాలకు రాజకీయ అండదండలు

కష్టించే మనస్తత్వం, పంటలు పండే సారవంతమైన భూములు, పచ్చని పంట పొలాలు ఉన్నప్పటికీ గ్రామ పెత్తనం కోసం అనాగరికంగా హత్యలకు పాల్పడడం ఆ గ్రామం స్పెషాలిటీ. పల్నాడు జిల్లాలో అత్యంత ఫ్యాక్షన్ గ్రామమేదైనా ఉందంటే అది వెల్దుర్తి మండలంలోని గుండ్లపాడు గ్రామంగా చెప్పుకోవచ్చు. విద్య, ఉద్యోగ అవకాశాలు అందిపుచ్చుకొని పల్నాడులోని అన్ని గ్రామాల్లో మార్పులు కోరుకుంటుంటే దానికి భిన్నంగా ఈ గ్రామంలో మాత్రం కక్షలు, కార్పణ్యాలకు అధిక ప్రాధాన్యత నిస్తున్నారు. పిల్లలకు వారసత్వంగా ఆస్తులు, విద్యను అందించాల్సిన పెద్దలు ఫ్యాక్షన్‌లో పాల్గొని అర్థాంతరంగా తనువు చాలిస్తూ తరువాత తరం వారికి ఫ్యాక్షన్ మరకలు వారసత్వంగా పంచుతున్నారు. ఇలా గుండ్లపాడు గ్రామంలో ఫ్యాక్షన్‌తో అన్నదమ్ములు, బావా బావమరుదులు, సొంత సామాజిక వర్గం తేడా లేకుండా కుటుంబ పెద్దలను కోల్పోయి ఆయా కుటుంబాలు ఆర్థికంగా చితికి పోయి నేటికి దుర్భర జీవితాలు కొనసాగిస్తున్నాయి.

మాచర్లటౌన్, మే 26 (ఆంధ్రజ్యోతి): వెల్దుర్తి మండలం గుండ్లపాడు గ్రామంలో 1971లో ప్రారంభమైన ఫ్యాక్షన్ హత్యలు నేటి వరకు 20కు చేరుకున్నాయి. రాజకీయ ఆధిపత్యం కోసం అధికారంలో ఎవరుంటే వారు గ్రామాన్ని ఏలుకుంటూ ప్రత్యర్థులను హతమార్చుతూ గ్రామం నుంచి తరిమేస్తున్నారు. అధికారం వచ్చాక తిరిగి ప్రత్యర్థులపై కక్ష తీర్చుకుంటున్నారు. గ్రామంలో పెరిక, వడ్డెర, ఎస్సీ సామాజిక వర్గాల ప్రజలు అధికంగా ఉన్నారు. పెరిక సామాజిక వర్గం రెండుగా చీలి జెవిశెట్టి పెద నాగయ్య, సాని రామయ్య కాంగ్రెస్ పార్టీ నాయకులుగా, దొంగరి చిన వీరయ్య ఇండిపెండెంట్ అభ్యర్థి జూలకంటి నాగిరెడ్డికి మద్దతు దారుడిగా పెత్తనం సాగించారు. గ్రామంపై ఆధిపత్యం కోసం ఈ రెండు వర్గాల మధ్య జరిగిన దాడుల్లో 1971లో మొదటిసారిగా దొంగరి చిన వీరయ్య హత్య జరిగింది. తరువాత 1989లో తిరిగి ఫ్యాక్షన్ పురుడు పోసుకుంది. కాంగ్రెస్ పార్టీకి ప్రత్యర్థి పార్టీగా నూతనంగా పుట్టుకొచ్చిన టీడీపీ పార్టీల మధ్య వర్గపోరు మొదలైంది. తోట కృష్ణమూర్తి, దొంగరి నాగేశ్వరరావు, చింతా చిన వీరయ్యలు టీడీపీ నాయకులుగా కొనసాగగా 1989లో రెండు వర్గాలు నాటుబాంబులతో దాడులకు దిగారు. ఈ దాడిలో టీడీపీకి చెందిన చింతా పెద వీరయ్య, కాంగ్రెస్ పార్టీకి చెందిన చింతా చిన మల్లయ్యలు హత్యకు గురయ్యారు. 1990లో టీడీపీకి చెందిన సాని కొండలు హత్యకు గురయ్యాడు. కొండలు హత్యకు ప్రతీకారంగా 1991లో కాంగ్రెస్‌కు చెందిన తోట రాములును హత్య చేశారు. తదుపరి టీడీపీకి చెందిన తోట దుర్గా మల్లయ్యను ప్రత్యర్థులు హత్య చేశారు. 1993లో గ్రామాన్ని విడిచి శిరిగిరిపాడులో నివాసముంటూ ప్రత్యర్థుల కోసం నాటుబాంబులు తయారు చేస్తుండగా ప్రమాదవశాత్తూ అవి పేలి దొంగరి నాగేశ్వరరావు, సాని చిన కోటయ్య, సాని పుల్లయ్య, చింతా కొండలు, చింతా పెద కోటయ్య ప్రాణాలు కోల్పోయారు. 1995లో టీడీపీకి చెందిన గుడిబండ్ల బంగారయ్యను ప్రత్యర్థులు హత్య చేశారు. 1996లో వడ్డెర సామాజిక వర్గం రెండు వర్గాలుగా విడిపోయి టీడీపీ, కాంగ్రెస్ గ్రూపుల్లో చేరిపోయాయి. కాంగ్రెస్‌కు చెందిన ఉప్పుతోళ్ల రాములును ప్రత్యర్థులు బాంబులు వేసి హత్యచేశారు. తరువాత ఉప్పుతోళ్ల నాగేశ్వరరావును ప్రత్యర్థులు హత్య చేశారు. 1997లో టీడీపీకి చెందిన దొంగరి నాగయ్య గుండ్లపాడు గ్రామంలో హత్యకు గురయ్యాడు. 1999లో కాంగ్రెస్, టీడీపీ గ్రూపులు రాజీ కుదుర్చుకొని ఫ్యాక్షన్‌కు స్వస్తి పలికారు. తిరిగి 2022 జనవరి 13న టీడీపీకి చెందిన తోట చంద్రయ్యను వైసీపీకి చెందిన చింతా శివరామయ్య హత్య చేశారు. తాజాగా టీడీపీకి చెందిన జెవిశెట్టి వెంకటేశ్వర్లు (మొద్దయ్య), అతని సోదరుడు కోటేశ్వరరావులను ఇటీవల వైసీపీ నుంచి టీడీపీలో చేరిన జెవిశెట్టి శ్రీనివాసరావు (బెబ్బులి), తోట వెంకట్రామయ్యలు హత్యకు పాల్పడ్డారు.





గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో వాహనాలను దహనం చేసిన దృశ్యం



జెవిశెట్టి వెంకటేశ్వర్లు (మొద్దయ్య) మృతదేహం (ఫైల్‌ఫోటో)



జెవిశెట్టి కోటేశ్వరరావు మృతదేహం (ఫైల్)

హత్య కేసులన్నీ రాజీలే..

గుండ్లపాడులో జరిగిన హత్యల్లో ఏ ముఠాకు చెందిన నిందితులకు కూడా శిక్ష పడకపోవడం గమనార్హం. హత్యలు జరిగిన తరువాత బెయిల్ పొంది శిక్ష పడే సమయానికి ఇరువర్గాలు రాజీ కుదుర్చుకోవడం, శిక్షలు పడకుండా బయటపడడం ఆనవాయితీగా మారింది. దీంతో ఏ వర్గానికి కూడా భయం లేకుండా పోయింది. దీనికితోడు రాజకీయ నాయకులు వారి ఎదుగుదల కోసం గ్రామంలో ఫ్యాక్షన్ ముఠాలను పెంచి పోషించడం జరుగుతోంది. ఇలా ఫ్యాక్షన్ ఘర్షణలో కుటుంబ పెద్దలను కోల్పోయి ఆర్థికంగా చితికిపోయి ఆయా కుటుంబాల సభ్యులు తీవ్ర దుర్భర పరిస్థితుల్లోకి నెట్టబడ్డారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే ప్రత్యర్థి పార్టీ వారిని గ్రామం నుంచి తరిమివేయడం, ప్రత్యర్థి పార్టీ తిరిగి అధికారంలోకి వచ్చాక మరలా గ్రామంలోకి వచ్చి కక్షసాధింపులకు పాల్పడడం రివాజుగా మారింది. ఒకే సామాజిక వర్గానికి చెందిన వారైనా, అన్నదమ్ములైనా, బావా బావమరుదులైనా ఫ్యాక్షన్ రక్కసిలో ఇరుక్కొని ప్రాణాలు కోల్పోతున్నారు. గుండ్లపాడు గ్రామంలో విస్తారంగా సారవంతమైన భూములుండి పంటలు పండిస్తూ కష్టించే మనస్తత్వం ఉన్న మహిళామణులున్నప్పటికీ ఆధిపత్యం కోసం పురుషులు ఫ్యాక్షన్ వైపు మొగ్గు చూపి కుటుంబాలను కష్టాల్లోకి నెట్టబడుతున్నారు. ప్రభుత్వాలు సీరియస్‌గా తీసుకొని గుండ్లపాడు గ్రామంలో ఫ్యాక్షన్ మూలాలను సమూలంగా తొలగించి ఆ ప్రజలకు విద్యతోపాటు ఉపాధి అవకాశాలు ఏర్పాటు చేసి మార్పు తీసుకురావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.



ప్రకృతి వ్యవసాయం చేద్దాం.. భూమాతకు జీవం పోద్దామంటూ ఆంధ్రప్రదేశ్ లోగో కనిపించేలా 30 రకాల విత్తనాలతో తన పంట పొలంలో వేసిన సుందర దృశ్యం

ప్రకృతి సేద్యంతో.. భూమాతకు జీవం

- అత్తోటలో ప్రకృతి వ్యవసాయదారుడి వినూత్న ఆకృతిలో సాగు
- పరిశీలించిన కాశ్మీర్, లఢక్ విద్యార్థినులు

తెనాలి, మే 26 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి వైపరీత్యాలను నివారించేందుకు సహజ సిద్ధమైన ప్రకృతి సాగు ఎంతో దోహదపడుతుందని, పర్యావరణాన్ని పరిరక్షించే దిశగా ప్రకృతి సాగుకు అందరు మొగ్గు చూపాలంటూ ప్రకృతి వ్యవసాయదారుడు, యర్రు బాపారావు వినూత్న రీతిలో సందేశాత్మక ఆకృతిని చూపుతూ సాగు చేసిన చిత్రం ఆకర్షణగా నిలిచింది. గుంటూరు జిల్లా కొల్లిపర మండలం, అత్తోటకు చెందిన రైతు బాపారావు "ప్రకృతి వ్యవసాయం చేద్దాం.. భూమాతకు జీవం పోద్దాం" అనే అక్షరాలు కనిపిస్తూ దాని మధ్యలో ఆంధ్రప్రదేశ్ మ్యాప్‌ను తీర్చిదిద్దేలా 40 రోజుల క్రితం 30 రకాల విత్తనాలతో నాటు వేశారు. ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ న్యాచురల్ ఫార్మింగ్ (ఏపీ సీఎన్ఎఫ్) విధానంలో ముందుకు వెళ్లేలా తమ ప్రకృతి సాగు చిత్రాన్ని ఆవిష్కరించారు. భూమి బాగుంటే మనిషి కూడా బాగుంటాడని, ప్రస్తుతం ఏర్పడుతున్న ప్రకృతి వైపరీత్యాలకు ఊహించని విపత్తులకు పర్యావరణ సమతుల్యత లోపమే కారణమనేది తెలియజేప్పాలనేదే తన ఉద్దేశమని రైతు బాపారావు అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రకృతి సాగు అధ్యయనంలో భాగంగా జమ్మూ కాశ్మీర్, లఢక్ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు సోమవారం అత్తోట వచ్చి ఇక్కడ రైతులు చేపడుతున్న సాగును పరిశీలించారు.

ప్రకృతి సాగు ఎంత మేలు చేస్తుందో అర్థం చేసుకున్నాం..

- తంబీర్ ఖాన్, జమ్మూ కాశ్మీర్



రూరల్ డెవలప్‌మెంట్‌లో పీజీ చేస్తున్న నేను ప్రకృతి సాగును ఆంధ్రప్రదేశ్ చేపడుతున్న రైతుల వివరాలు తెలుసుకుని పరిశీలించేందుకు వచ్చాం. అత్తోట రైతులు చేపడుతున్న సాగు విధానాలు, భూ పరిరక్షణ చర్యలు, మమ్ములను ఆకట్టుకున్నాయి. ప్రకృతి సాగుపై అనేక మెలకువలు తెలుసుకున్నందుకు సంతోషంగా ఉంది.

భూటాన్ సరిహద్దుల్లోనూ ప్రకృతి సాగు చేస్తాం..

- పద్మలాజేష్, భూటాన్ - టిబెట్ సరిహద్దు లఢక్ విద్యార్థిని



ప్రకృతి సాగు వల్ల లాభాలు పర్యావరణ పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఈ అధ్యయనంలో తెలుసుకున్నాం. భవిష్యత్ తరాలకు మా ప్రాంతంలో వీటిని అందించేందుకు ప్రయత్నం చేస్తాం. భూటాన్ - టిబెట్ సరిహద్దులో కూడా ప్రకృతి సాగు చేపడతాం. మా ప్రాంతాల వారికి ఇక్కడ సాగు విధానాలను తెలియజేసి మెరుగైన ఫలితాలు సాధించడానికి మా వంతు సహకారం అందిస్తాం.

కార్పొరేట్‌కు దీటుగా.. ప్రభుత్వ కళాశాలలు

- ఎంసెట్, జేఈఈ, నీట్ పరీక్షకు ప్రత్యేక శిక్షణ

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏడాది నుంచి సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థిని విద్యార్థులు చదివే ఈ కళాశాలల్ని ఉన్నతంగా తీర్చిదిద్ది మెరుగైన విద్యతోపాటు విద్యార్థులకు అవసరమైన రాష్ట్ర, జాతీయస్థాయి పోటీ పరీక్షలకు శిక్షణను ఇచ్చేందుకు కార్యాచరణ సిద్ధమైంది. నూతన ప్రభుత్వం ఏర్పాటు అయిన తరువాత జూనియర్ కళాశాలల్లో భారీస్థాయిలో సంస్కరణలు ప్రారంభం అయ్యాయి.



గుంటూరు (విద్య), మే 26 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో 23 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు మరొక ఎయిడెడ్ జూనియర్ కళాశాల ఉన్నాయి ఆ కళాశాలలో దాదాపు 15 వేల మందికి పైగా విద్యార్థులు ఇంటర్ విద్యను అభ్యసిస్తున్నారు. ప్రస్తుతం వీటితోపాటు ప్లస్ టు కళాశాలలు కూడా విద్యార్థులకు అందుబాటులోకి వచ్చాయి. ఈ నేపథ్యంలో విద్యార్థులకు మెరుగైన శిక్షణ ఇచ్చేందుకు కళాశాలల్లో ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా పూర్తిస్థాయిలో ఫర్నీచర్, తరగతి గదులు, విద్యార్థినీ విద్యార్థులకు అవసరమైన ల్యాబ్ పరికరాలు, ఆటస్థలం, మరుగుదొడ్లు, స్వచ్ఛమైన తాగునీరు కల్పిస్తున్నారు. వీటితోపాటు గత ఏడాదినుంచి విద్యార్థినీ విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు నోట్ బుక్స్ అందిస్తున్నారు. ఇంకా అనేక కళాశాలలో మధ్యాహ్న భోజన పథకం కూడా అందుబాటులోకి తీసుకొచ్చారు.

పోటీ పరీక్షలకు మెరుగైన శిక్షణ...

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కార్పొరేట్ స్థాయిలో విద్యార్థినీ విద్యార్థులను జాతీయ స్థాయి పోటీ పరీక్షలకు శిక్షణ అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు ఇందుకోసం గుంటూరు నగరంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను నోడల్ సెంటర్‌గా ఏర్పాటుచేసి ఎంసెట్‌తో పాటు జేఈఈ, జేఈఈ అడ్వాన్స్, నీట్ పరీక్షలకు శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేశారు. ఉమ్మడి జిల్లాలోని 23 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్ని అనుసంధానం చేస్తూ ఈ శిక్షణ అందించడానికి ఏడాది కార్యాచరణ సిద్ధం చేశారు. ఇందు కోసం అవసరమైన పుస్తకాలను కూడా ఇంటర్‌బోర్డు త్వరలో విద్యార్థినీ విద్యార్థులకు అందించనుందని అధికారులు చెబుతున్నారు.

పుస్తకాలు పంపిణీ పూర్తి

అవసరమైన పుస్తకాలను ఇప్పటికే పంపిణీ చేశారు. మారిన సిలబస్ కనుగుణంగా ఈ పుస్తకాలను రూపొందించి పంపిణీ చేశారు వేసవి సెలవులకు ముందే ఈ కార్యక్రమాన్ని ఇంటర్ బోర్డు పూర్తి చేసింది.

అవకాశాల్ని సద్వినియోగం చేసుకోవాలి

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అందించే సౌకర్యాలను విద్యార్థులకు సద్వినియోగం చేసుకోవాలని ఇంటర్ బోర్డు అధికారులు విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే ప్రత్యేకంగా అధ్యాపకుల ద్వారా అడ్మిషన్లు కోసం క్యాంపులు నిర్వహించి ఇక్కడ ఉన్న సౌకర్యాలు వివరించారు. విద్యార్థులకు అవసరమైన సమస్త సౌకర్యాలు ప్రస్తుతం కళాశాలలో అందుబాటులో ఉన్నాయని మెరుగైన బోధన అందించే అధ్యాపకులు అందుబాటులో ఉన్నట్లు వివరించారు.



జనరల్ బోగీలు నాటికలోని ఓ సన్నివేశం

నాటిక పోటీలతో సమాజానికి మంచి సందేశం

- ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు

నాదెండ్ల, మే 26 (ఆంధ్రజ్యోతి): నాటిక పోటీల ద్వారా సమాజానికి మంచి సందేశాన్ని అందించ వచ్చని నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. మండలంలోని సాతులూరు గ్రామంలో నటరత్న ఎన్‌టీఆర్ కళా పరిషత్ ఆధ్వర్యంలో జరుగుతున్న తృతీయ జాతీయ స్థాయి పోటీల్లో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని, పలువురికి ఎన్‌టీఆర్ అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులను అభినందించారు. కళాకారుడు వీసీ హెచ్ ప్రసాదు, పి.ఓబులయ్య, ఆడిటర్ బొల్లేపల్లి శ్రీనివాసరావు, మీరయ్యకు ఎన్‌టీఆర్ అవార్డు అందజేసి సన్మానించారు. కాగా జనరల్ బోగీలు నాటిక పలువురిలో ఆలోచన రేకెత్తించింది. ఒక ఉపాధ్యాయురాలు కుమారుడు జనరల్ బోగీలో ప్రయాణిస్తూ రైల్వే యాక్సిడెంట్‌లో మృతి చెందగా.. న్యాయం కోసం ఆమె చేసిన పోరాటం ప్రేక్షకుల్లో ఆలోచింపజేసింది. రిజర్వేషన్ ఉన్న వారికేనా సాయం అందేది, జనరల్ బోగీల ప్రయాణికులు ఎందుకు అందదంటూ నాటికలోని సన్నివేశాలు ఆకట్టుకున్నాయి. అదే విధంగా రే చీకటి భార్య, భర్తల కథనంతో రూపొందిన దొందుదొందే నాటిక ప్రేక్షకులను నవ్వించింది. అధిక సంఖ్యలో తరలి వచ్చిన ప్రేక్షకులతో నాటిక పోటీలు కోలాహలంగా సాగుతున్నాయి.



బాపట్ల వ్యవసాయ పరిశోధన స్థానం, వ్యవసాయ కళాశాల క్షేత్రం ద్వారా బ్రీడర్, ఫౌండేషన్ సీడ్ రైతులకు అందజేత

బీపీటీ వంగడాల విక్రయం ప్రారంభం

- వ్యవసాయ కళాశాల క్షేత్రం ద్వారా ఫౌండేషన్ సీడ్
- పరిశోధన స్థానం ద్వారా బ్రీడర్ సీడ్

బాపట్ల, మే 26 (ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని బాపట్ల వ్యవసాయ పరిశోధన స్థానం రైతులకు బ్రీడర్ సీడ్ విక్రయాలు ప్రారంభించింది. అదేవిధంగా వ్యవసాయ కళాశాల క్షేత్రం రైతులకు ఫౌండేషన్ సీడ్ విక్రయిస్తోంది. 30 కిలోల బ్యాగ్‌లను రైతుల అవసరాన్ని బట్టి, ముందుగా దరఖాస్తు చేసుకున్నవారికి ప్రాధాన్యమిస్తూ విక్రయిస్తున్నారు. రుతుపవనాలు ముందుగా రావడం, వర్షాలు విస్తారంగా కురుస్తుండడంతో.. జూన్ నుంచి వెద సాగుకు, నారుమడులు పోసేందుకు అనుకూలంగా ఉంది. దీంతో ముందస్తుగా విత్తనాలు కోసం బాపట్ల పరిసర ప్రాంతాల నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి రైతులు పెద్ద ఎత్తున తరలి వస్తున్నారు. బాపట్ల వ్యవసాయ పరిశోధన స్థానంలో బ్రీడర్ సీడ్ బీపీటీ 2595 (తేజ) రకం 30 క్వింటాళ్లు, బీపీటీ 2846 రకం 20 క్వింటాళ్లు, బీపీటీ 2270 (భావపురి సన్నాలు) రకం 60 క్వింటాళ్లు, బీపీటీ 2231 (అక్షయ) రకం 6క్వింటాళ్లు, బీపీటీ 2295 (బాపట్ల మసూరి)రకం 5 క్వింటాళ్లు, బీపీటీ 2841 రకం 15 క్వింటాళ్లు, బీపీటీ 3291 (సోనా మసూరి) రకం 6 క్వింటాళ్లు, బీపీటీ 2782 (భవతి) రకం 30 క్వింటాళ్లు, బీపీటీ 3082 రకం 35 క్వింటాళ్లు, బీపీటీ 2766 రకం 10 క్వింటాళ్లు చొప్పున విత్తనాలు అందుబాటులో ఉంచారు. అదేవిధంగా వ్యవసాయ పరిశోధన స్థానం వద్ద ఫౌండేషన్ సీడ్ బీపీటీ 2846 రకం 84 క్వింటాళ్లు విక్రయానికి సిద్ధంగా ఉన్నాయి. బాపట్ల వ్యవసాయ కళాశాల క్షేత్రం ఫౌండేషన్ సీడ్ విక్రయిస్తోంది. అందులో బీపీటీ 5204 (సాంబ మసూరి), బీపీటీ 2270 (భావపురి సన్నాలు), బీపీటీ 2782 (భవతి), బీపీటీ 2595 (తేజ) రకాల విత్తనాలు 1,560 క్వింటాళ్లు రైతులకు విక్రయించేందుకు సిద్ధం చేసి విక్రయిస్తున్నారు. మొత్తం 3 వేల బ్యాగ్‌లను రైతులకు విక్రయించనున్నట్లు సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఇ.అరుణ తెలిపారు.

బ్రీడర్ సీడ్ 30 కిలోల బ్యాగ్ రూ.2,334



వ్యవసాయ పరిశోధన స్థానం ద్వారా బ్రీడర్ సీడ్ 30కిలోల బ్యాగ్ రూ.2,334, ఫౌండేషన్ సీడ్ బ్యాగ్ రూ.1,450 కు విక్రయిస్తున్నాం. ఇప్పటి వరకు బ్లాక్ రైస్, రెడ్‌రైస్ విత్తనాలు రెండు కిలోల మినీ కిట్‌లను దరఖాస్తు చేసుకున్న రైతులందరికి ఇవ్వడం జరిగింది. మిగిలిన రకాలు అందుబాటులో ఉన్నాయి. డిమాండ్‌ను బట్టి వెరైటీలు పూర్తిగా విక్రయిస్తున్నారు. అవసరమైన రైతులు ముందుగా దరఖాస్తు పెట్టుకొని విత్తనాలు పొందవచ్చు.

- డాక్టర్ బి.కృష్ణవేణి, ప్రధాన శాస్త్రవేత్త, బాపట్ల వ్యవసాయ పరిశోధన స్థానం

రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలల్లో ప్రవేశాలకు కౌన్సెలింగ్

గుంటూరు (విద్య) మే 26 (ఆంధ్రజ్యోతి): గురుకుల జూనియర్ కళాశాలల్లో ప్రవేశం కోసం సోమవారం గుంటూరు పాత బస్టాండ్ సెంటర్లోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో ఇటీవల ఏపీఆర్జేసీ సెట్ నిర్వహించిన విషయం తెలిసిందే. ఆంధ్ర రీజియన్ పరిధిలోని వివిధ జిల్లాల నుంచి ర్యాంకు సాధించిన విద్యార్థులు కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. ఈ రీజియన్ పరిధిలో తోటకూడి ప్రభుత్వ జూనియర్ కళాశాల, నిమ్మకూరు బాలుర, బాలికల కళాశాల, నాగార్జున సాగర్‌లోని బాలుర కళాశాల, గుంటూరులోని డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ రెసిడెన్షియల్ కళాశాల, వెంకటగిరిలోని రెసిడెన్షియల్ కళాశాలల్లో 299 సీట్లకు ప్రవేశాల కోసం తొలిరోజు 1:5 నిష్పత్తిలో విద్యార్థులను కౌన్సెలింగ్‌కు పిలిచారు. మొత్తం 1,328 మంది విద్యార్థిని విద్యార్థులు కౌన్సెలింగ్ హాజరుకాగా 131మంది బాలురు, 33మంది బాలికలకు సీట్లు కేటాయించారు. మంగళవారం బైపీసీ విద్యార్థులకు, బుధవారం ఎంఈసీ, సీఈసీ గ్రూపులకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు కోఆర్డినేటర్స్ వెల్లడించారు. కౌన్సిలింగ్ కేంద్రాన్ని ఉర్దూ డీఐ ఎస్‌కే ఎండీ ఖాసిం సందర్శించారు. విద్యార్థులు, సిబ్బందికి కల్పించిన భోజన, ఇతర వసతులను ఆయన పర్యవేక్షించారు.



ఎంపికైన వారికి నియామక ఉత్తర్వులు అందజేస్తున్న కో-ఆర్డినేటర్స్

శిథిలావస్థలు..!

- మరమ్మతులకు నోచుకోని ఇరిగేషన్ కార్యాలయం

బాపట్ల, మే 26 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఏడాది శిథిలావస్థ కాల్వలకు మరమ్మతులు చేపట్టే.. ఇరిగేషన్ అధికారులు.. తాము విధులు నిర్వహించే కార్యాలయానికి మాత్రం మరమ్మతులు చేయించుకోలేక పోతున్నారు. దీంతో శిథిలావస్థ భవనం స్లాబ్ పెచ్చులూడి పడుతున్నాయి. తలుపులు ధ్వంసమై పనికిరాకుండా పోయాయి. అయినప్పటికి అధికారులు అందులోనే ఉండి తమ కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు. 1954 సంవత్సరానికి ముందు బాపట్ల పట్టణ నడిబొడ్డున గడియార స్తంభం పక్కనే జీబీసీ రోడ్డులో ఈ భవనాన్ని నిర్మించారు. బాపట్ల వెస్ట్రన్ సబ్ డివిజన్ అధికారులతోపాటు చీరాల డివిజన్ అధికారులు కూడా ఇక్కడే ఉండి.. తమ పరిధిలోని సాగునీటి కాల్వలను పర్యవేక్షిస్తుంటారు. ఇప్పటి వరకు ఈ కార్యాలయం నుండి 58మంది డీఈలు విధులు నిర్వహించారు. అయినప్పటికి పై అంతస్తు శిథిలమైనా పట్టించుకోలేదు. కింద అంతస్తు పటిష్టంగా ఉన్నప్పటికీ.. ఆ తర్వాత నిర్మించిన పై అంతస్తు మాత్రం శిథిలావస్థకు చేరింది. దీంతో అధికారులు కార్యాలయ గదుల్లో ఉండటానికి సిబ్బంది భయపడుతున్న పరిస్థితి నెలకొంది. పైఅంతస్తు ఎప్పుడైనా.. కూలిపోయే ప్రమాదం పొంచి ఉంది.



పూర్తిగా దెబ్బతిన్న ఇరిగేషన్ ఏఈ గది తలుపు పెచ్చులూడి పడుతున్న శ్లాబ్ పై అంతస్తు దృశ్యం



దెబ్బతిన్న ఇరిగేషన్ కార్యాలయం పై అంతస్తు

కొత్తయాప్‌లో రిజిస్టర్ చేసుకోండి



రాచపూడిలో నల్లబర్లీ పొగాకును పరిశీలిస్తున్న ఏవో శ్రీనివాసరావు

మేదరమెట్ల, మే 26(ఆంధ్రజ్యోతి): బర్లీ రైతులు తమ పేర్లను ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన బ్లాక్‌బర్లీ యూజర్ మాన్యువల్ యాప్‌లో నమోదు చేయించుకోవాలని ఏవో శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం మండలంలోని రాచపూడిలో నల్లబర్లీ, పొగాకు మండెలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన తమ శాఖ సిబ్బందితో మాట్లాడారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం వ్యవసాయ శాఖ సిబ్బంది ఈ కొత్త యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. కొత్తగా డౌన్‌లోడ్ చేసుకున్న యాప్‌లల్లో బర్లి రైతుల పేర్లను నమోదు చేయాలన్నారు. రైతులు కూడా తమ పేర్లు యాప్‌లో నమోదు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతులు, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

విశాఖ ఉక్కును ప్రైవేటీకరిస్తే ఊరుకొనేది లేదు

● కార్మిక సంఘాల నాయకుల హెచ్చరిక

ఒంగోలు కలెక్టరేట్, మే 26 (ఆంధ్రజ్యోతి) : విశాఖ ఉక్కును ప్రైవేటీకరిస్తే ఊరుకోనేది లేదని కార్మిక సంఘాల నాయకులు హెచ్చరించారు. వివిధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట జరిగిన ధర్నాకు సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి. శ్రీనివాసులు, ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు, ఏఐఎఫ్‌టీయూ న్యూ జిల్లా కార్యదర్శి ఎంఎస్‌సాయిలు అధ్యక్షత వర్గంగా వ్యవహరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో సంయుక్తకిసాన్ మోర్చా జిల్లాకన్వీనర్ చుండూరి రంగారావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై మండిపడ్డారు. ఒక పక్క విశాఖ ఉక్కును ప్రైవేటీకరించమని చెప్తూనే మరో వైపు దొడ్డిదారిన ప్రైవేటీకరణ చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తుందని ఆరోపించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జీవీ కొండారెడ్డి మాట్లాడుతూ విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను అడ్డుకుంటామన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జి ల్లా కార్యదర్శి కే ఆంజనేయులు మాట్లాడుతూ విశాఖ ఉక్కు ను రక్షించుకొనేందుకు వ్యవసాయకార్మికులందరూ ఏకమై పోరాడతామన్నారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వడ్డెహనుమారెడ్డి మాట్లాడుతూ కేంద్రానికి మద్దతు ఇస్తున్న రాష్ట్ర ప్రభుత్వం విశాఖ ఉక్కును రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపైనే ఉందన్నారు. ఈకార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు కే వీరారెడ్డి, ఎస్‌డీ సర్దార్, శ్రీరామ్ శ్రీనివాసరావు, చీకటి శ్రీనివాసరావు, తంబి శ్రీనివాసులు, టీవీ రావు, సీహెచ్ రాంబాబు, పేరయ్య, దామా శ్రీనివాసులు, జి. రమేష్ తదితరులు ఉన్నారు. అనంతరం కలెక్టర్ తమీమ్ అన్సారియాను కలిసి వినతిపత్రం అందజేశారు.



దేవుడికి దిక్కేది?

● 161 ఎకరాల మాన్యం ఉన్నా ఆలనాపాలన కరువు
● శిథిలావస్థలో నరసింహస్వామి ఆలయం
● పట్టించుకోని దేవదాయ అధికారులు
● పునర్నిర్మాణం చేయాలంటున్న భక్తులు

పెద్దదోర్నాల, మే 26 (ఆంధ్రజ్యోతి) : కోట్లాది రూపాయలు విలువ చేసే మాన్యాలున్నా.. ఆలనాపాలనా లేక చరిత్రాత్మక దేవాలయం శిథిలావస్థకు చేరింది. ఆలయ కమిటీ ఉందో లేదో కూడా తెలియని పరిస్థితి. పాలకుల అలసత్వం, అధికారుల స్వార్థంతో దశాబ్దాల నాటి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవాలయం కునారిల్లుతోంది. దోర్నాలలో క్రీస్తు పూర్వం జయమేజయరాజు శ్రీ లక్ష్మీ నరసింహుని ప్రతిష్ఠించారని, అంత ప్రాముఖ్యత గల దేవాలయాన్ని పట్టించుకోకపోవడం వల్ల శిథిలావస్థకు చేరుకుందని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దేవాలయం అభివృద్ధికి దూపదీప నైవేద్యాన్ని అందించేందుకు 18 గ్రామాలకు చెందిన భక్తులు 161.40 ఎకరాల మాన్యాన్ని కేటాయించారు. ప్రస్తుతం ఈ భూముల విలువ రూ.15 కోట్లకుపైనే పలుకుతుందని భక్తుల నమ్మకం. కొన్ని భూములు ఆక్రమణకు గురి కాగా మరికొన్ని భూములను వేలం పాటలు నిర్వహించి వచ్చిన సొమ్మును ఎండోమెంటు అధికారులు బ్యాంకుల్లో జమ చేస్తున్నారే గానీ దేవాలయం అభివృద్ధికి ఎటువంటి కృషి చేయడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

● దేవాలయ మాన్యాలివీ...

దోర్నాల రేగడిచేను 214 సర్వే నెంబరులో 7 ఎకరాలు, 113 సర్వే నెంబరులో 13.41, జమ్మిదోర్నాలలో 622/1 సర్వే నెంబరులో 12.48 ఎకరాలు, 284/2లో 12.21, అయినముక్కులలో రెవెన్యూలోని కడపరాజుపల్లెలో 238/1 సర్వే నెంబరులో 7.90 ఎకరాలు, గణపతిరస్తా వద్ద 3 సర్వే నెంబరులో 6.71 ఎకరాల భూములున్నాయి. ఈ క్రమంలో అర్చకులకు 21 ఎకరాలు కేటాయించగా 113 సర్వే నెంబరులోని 13.41 ఎకరాలు ప్రభుత్వం రూ.8లక్షలకు కొనుగోలు చేసి పేదలకు ఇంటి స్థలాలుగా అందజేసింది. కానీ దేవాలయానికి ఎటువంటి స్థలాన్నీ కేటాయించలేదు. తిమ్మాపురంలో 268/1 సర్వే నెంబరులో 5.06 ఎకరాలు, పెద్దబొమ్మలాపురంలో 465 సర్వే నెంబరులో 7.64 ఎకరాలు, 470 సర్వే నెంబరులో 7.78 ఎకరాలు, చిన్నగుడిపాడులో 36/2 సర్వే నెంబరులో 12.64 ఎకరాలు, చట్టుతాండాలో 485 సర్వే నెంబరులో 7 ఎకరాలు, చిలకచెర్ల 442 సర్వే నెంబరులో 5.21, రామచంద్రకోట 29/1 సర్వే నెంబరులో 9 ఎకరాలు, చిన్నదోర్నాల 26/2 సర్వే నెంబరులో 10.35 ఎకరాలు, సానికవరం రామాయలపాలెం 450 సర్వే నెంబరులో 12.69 ఎకరాలు, తమ్మడపల్లి 715 సర్వే నెంబరులో 5.50, లింగంవానిపల్లె 49 సర్వే నెంబరులో 8.45 ఎకరాలు ఆలయ మాన్యాలుగా ఉన్నాయి. ప్రతి ఏటా వేలం వేస్తూ వచ్చిన డబ్బును బ్యాంకుల్లో వేస్తున్నారో లేక ఏమైపోతున్నాయో కానీ ఆలయ అభివృద్ధికి ఖర్చు చేయడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రతి ఏటా నరసింహ స్వామి జయంతి ఉత్సవాలకు కూడా వీసమెత్తు ఖర్చు చేయడంలేదు. కేవలం భక్తుల తోడ్పాటుతో నామమాత్రంగా ఉత్సవం నిర్వహిస్తున్నారు.

● శిథిలావస్థలో దేవాలయం

శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. పలుమార్లు దొంగలు పడి వెండి కిరీటాలు, హుండీలోని సొమ్ము, విలువైన వస్తువులు అపహరించుకుపోయాక ఇనుప గేట్లు ఏర్పాటు చేశారు. అలా కాకుండా కోట్ల విలువైన ఆస్తులున్నా నరసింహ స్వామి దేవాలయం పునర్నిర్మించాలని భక్తులు కోరుతున్నారు.



రోడ్డుపై బోల్తా కొట్టిన కారు

కారును ఢీకొన్న లారీ..

● నలుగురికి స్వల్పగాయాలు ● కలికివాయి ఫ్లైవోవర్‌పై ప్రమాదం

సింగరాయకొండ, మే 26 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారిపై ముందువెళ్తున్న కారును వెనుకవైపు వస్తున్న లారీ ఢీకొనడంతో నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన ప్రకాశం జిల్లా సింగరాయకొండ మండలం కలికివాయి ఫ్లైవోవర్‌పై సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. చిలకలూరిపేటకు చెందిన నిమ్మల చంద్రశేఖరరావు-రాజేశ్వరి, కాకుమాని అంజన్‌రావు-చిలకమ్మ దంపతులు తిరుమలకు వెళ్లి దైవదర్శనం చేసుకున్నారు. తిరిగి స్వగ్రామానికి బయల్దేరారు. కారు కలికివాయి ఫ్లైవోవర్ వద్దకు చేరుకునే సరికి వెనుక వైపు వస్తున్న లారీ అదుపుతప్పి ఢీకొట్టింది. దీంతో రోడ్డుపై కారు బోల్తా పడింది. అందులో ప్రయాణిస్తున్న నలుగురికి స్వల్పగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న హైవే మొబైల్ పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. కారులో ఉన్న వారిని బయటకు తీశారు. అనంతరం అక్కడికి చేరుకున్న ఎస్సై బి.మహేంద్ర హైవే అంబులెన్స్‌లో ప్రథమ చికిత్స చేయించి క్షతగాత్రులను ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. అనంతరం క్రేన్ సహాయంలో కారును పక్కను తొలగించారు.

మావోయిస్టుల మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, మే 26 (ఆంధ్రజ్యోతి) : ఛత్తీష్‌గఢ్ రాష్ట్రంలోని నారాయణ్‌పూర్ జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో చనిపోయిన మావోయిస్టుల మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట జరిగిన ధర్నాలో న్యూడెమోక్రసీ రాష్ట్ర అధికార ప్రతినిధి చిట్టిపాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఈనెల 21న నారాయణ్‌పూర్‌లో జరిగిన బూటకపు ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు, మిలటరీ పత్రిక ఎడిటర్ నాగేశ్వరరావు, తెలంగాణాకు చెందిన విజయలక్ష్మి, సంగీత, రాకేష్‌తో పాటు మరో 22 మంది మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించకుండా మార్చురీలో పెట్టడం దుర్మార్గంగా ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టును ఆశ్రయిస్తే అక్కడి పోలీసులను కలవాలని చెప్పినా ఇంత వరకు మృతదేహాలను అప్పగించలేదన్నారు. ఇప్పటికైనా మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు వీరాంజనేయులు, వెంకటేష్, క్రాంతి, చావలి సుధాకర్, జార్జి, పద్మ, రాజా, లింగయ్య, దాసరి సుందరం తదితరులు ఉన్నారు.



సాగు చేసిన పందిరి దొండ



పందిరి దొండ.. రైతుకు అండ!

పెద్ద దోర్నాల, మే 26 (ఆంధ్రజ్యోతి) : ఏటా సాగు చేసే వాణిజ్య పంటలు పత్తి, మిరపలో అపార నష్టాల్ని చవిచూస్తున్న రైతులకు పందిరి దొండసాగు అండగా నిలుస్తోంది. ఒకసారి మొక్కలు నాటితే మూడేండ్ల వరకు ఫలాసాయాన్నిచ్చే దొండ సాగు పట్ల రైతులు మొగ్గు చూపుతున్నారు. తెగుళ్ల బెడద పెద్దగా ఉండదు. కొద్దిపాటి నీటి తడులతో నికరాదాయం లభిస్తుంది. కూలీలు కూడా పెద్దగా అవసరం లేకుండానే ఇంటి మనుషులతోనే దిగుబడులు తీయొచ్చు. సీజను బట్టి ధరలు పెరుగుదలతో అధిక లాభాలు కూడా వస్తున్నాయి. దీంతో పందిరి దొండసాగు చిన్న సన్న కారు రైతులకు ఎంతగానో ఊతమిస్తోంది. పైగా ప్రభుత్వం కూడా ప్రోత్సాహాన్నిస్తూ పందిరి ఏర్పాటుకు రాయితీ కల్పిస్తోంది.

● పందిరితో అధిక దిగుబడులు

దొండ సాగుకు పందిరి ఖర్చు రైతులకు కొంచెం కష్టమనిపించినా మున్ముందు సమస్య కాదు. ఎకరంలో దొండ సాగుకు పందిరి వేసేందుకు రూ.4 లక్షలు ఖర్చవుతాయి. ప్రభుత్వం లక్ష రూపాయలు రాయితీ కల్పిస్తోంది. శాశ్వత పందిరి ఏర్పాటు వల్ల పంటలో తెగుళ్ల బెడద ఉండదు. తద్వారా దిగుబడులు పెరుగుతాయి. ఒకసారి నాటితే మూడేళ్ల పంట దిగుబడి తీయొచ్చు. వారం వారం కోతలు అందుబాటులోకి వస్తాయి. కోతకు ఎకరానికి 5 క్వింటాళ్ల దిగుబడులు వస్తాయని రైతులు చెబుతున్నారు. సీజను బట్టి కిలో రూ.15లు నుంచి రూ.25 వరకు మార్కెట్టులో కొనుగోలు చేసినా మంచి ఆదాయం లభిస్తుందని చెబుతున్నారు. చిన్న, సన్నకారు రైతులకు మరింత ఉపయుక్తంగా ఉంటుందని దొండసాగు రైతులు చెబుతున్నారు. మండలంలోని చిన్నదోర్నాల, తిమ్మాపురం, రామచంద్రకోట, బొమ్మలాపురం గ్రామాల్లో కొందరు రైతులు సాగు చేస్తూ లాభాలు గడిస్తున్నారు.

విద్యతోనే విలువలు

● ప్రతిభచాటిన పద్మశాలీ విద్యార్థులకు సత్కారం



ప్రతిభచాటిన విద్యార్థులతో ముఖ్యఅతిథులు, ప్రతినిధులు

చీమకుర్తి,మే26(ఆంధ్రజ్యోతి): విద్య నేర్చుకోవటం ద్వారా విలువను పొందవచ్చని ఆర్‌డబ్ల్యూడీ జిల్లా పీడీ పి.విద్యాసాగర్ తెలిపారు.పట్టణంలోని భద్రావతి సమేత భావనారుషి కల్యాణమండపంలో గత విద్యాసంవత్సరంలో పదోతరగతి, ఇంటర్‌లో ప్రతిభచాటిన పద్మశాలీ విద్యార్థులకు పద్మశాలీ సేవా సంఘం ఆధ్వర్యంలో ప్రతిభాపురస్కారాలు అందచేసి ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న విద్యాసాగర్ మాట్లాడుతూ చదువుతో జీవన స్థితిగతులు మారిపోతాయన్నారు. ప్రతి ఒక్కరూ ఉన్నతవిద్యను అభ్యసించి అత్యున్నతస్థాయికి ఎదగాలని అకాంక్షించారు. ప్రముఖ న్యూరాలజిస్టు వి.గోపాలకృష్ణ మాట్లాడుతూ నేటి కాలంలో విద్యార్థులు టెక్నాలజీతో కూడిన విద్యను అభ్యసించాలని కోరారు. గుండె వైద్యనిపుణుడు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వైద్యవిద్యను అభ్యసించటానికి విద్యార్థులు ఆసక్తి చూపాలన్నారు. అనంతరం విద్యార్థులకు ముఖ్యఅతిథుల చేతులమీదుగా ప్రతిభాపురస్కారాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రాజ్యలక్ష్మి,కౌన్సిలర్ సోమా శేషాద్రి, సంఘనాయకులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

జిల్లాలో 18.4 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం

ఒంగోలు కలెక్టరేట్, మే 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో భారీ వర్షం కురిసింది. సోమవారం ఉదయానికి గడిచిన 24 గంటల్లో 18.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. యర్రగొండపాలెంలో అత్యధికంగా 78.8 మి.మీ. వర్షపాతం నమోదు కాగా అత్యల్పంగా తాళ్ళూరు మండలంలో 1.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. పుల్లలచెరువు 76.0, తర్లుబాడు 46.4, దర్శి 41.4, త్రిపురాంతకం 38.4, పెద్దారవీడు 36.4, కంభం 35.4, వెలిగండ్ల 33.0, దొనకొండ 29.8, కురిచేడు 29.0, మార్కాపురం 27.2, అర్ధవీడు 20.4, బేస్తవారపేట 20.4 మి.మీ. వర్షపాతం నమోదైంది. గిద్దలూరు 18.2, జరుగుమల్లి 17.8, హనుమంతునిపాడు 17.6, దర్శాల 16.4, పీసీపల్లి 16.2, పొన్నలూరు 15.2, రాచర్ల 15.0, సీఎస్‌పురం 14.2, కొమరోలు 12.4, టంగుటూరు 10.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. మిగిలిన మండలాల్లో కొద్దిపాటి జల్లులు పడ్డాయి.

బకాయిలు చెల్లించకపోతే సంక్షోభంలోకి విద్యా సంస్థలు

● ప్రైవేటు పాఠశాలల సంఘాల సమాఖ్య

అమరావతి, మే 26 (ఆంధ్రజ్యోతి): విద్యాహక్కు చట్టం కింద చేరిన విద్యార్థుల ఫీజుల బకాయిలు విడుదల చేయాలని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల సమాఖ్య ప్రభుత్వాన్ని కోరింది. లేనిపక్షంలో విద్యా సంస్థలు సంక్షోభంలో పడతాయని సోమవారం ఓ ప్రకటనలో ఆందోళన వ్యక్తంచేసింది. విద్యాహక్కు చట్టం కింద ప్రభుత్వం ప్రతిపాదించిన ఫీజులపై అభ్యంతరం వ్యక్తంచేసినట్లు తెలిపింది. ప్రైవేటు పాఠశాలలకు ఇబ్బందికరంగా ఫీజులు నిర్ణయించడం సరికాదని పేర్కొంది. ఫీజులపై అధికారుల నుంచి సరైన సమాధానం రాకపోవడంతో ప్రతిపాదిత ఫీజులను తాము ఆమోదించలేదని తెలిపింది.

చిత్తడి నేల అథారిటీకి నలుగురు అధికారేతర సభ్యుల నియామకం

అమరావతి, మే26(ఆంధ్రజ్యోతి): స్టేట్ వెట్‌ల్యాండ్(చిత్తడి నేలల) అథారిటీకి నలుగురు అధికారేతర సభ్యులను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులిచ్చింది. స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్‌కు చెందిన చిత్తడి నేలల జీవావరణ శాస్త్ర నిపుణుడు ఆర్ రామ సుబ్రహ్మణియన్, ప్రపంచవ్యాప్త ప్రకృతి నిధి(డబ్ల్యూడబ్ల్యూఎఫ్-ఇండియా) రాష్ట్ర సంచాలకుడు ఫరీదా తంపాల్, కోయంబత్తూర్‌లోని తడిభూముల జీవావరణ విభాగం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ గోల్డిన్ క్వాడ్రోస్, డెహ్రాడూన్‌లోని అంతరించిపోతున్న జాతుల నిర్వహణ సంస్థ శాస్త్రవేత్త ఆర్ సురేష్‌కుమార్ సభ్యులుగా నియమితులయ్యారు. కాగా రాష్ట్రంలో చిత్తడి నేలల పరిరక్షణ కోసం స్టీరింగ్ కమిటీ స్థానంలో ఈ అథారిటీ ముఖ్యమంత్రి అధ్యక్షతన ఏర్పాటైంది. అధికారులతో పాటు మూడేళ్ల పదవీ కాలానికి అధికారేతర సభ్యులను ప్రభుత్వం నామినేట్ చేసింది.

ఫిర్యాదుల పరిష్కారానికి మూడు బృందాలు

ఒంగోలు విద్య, మే 26 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో ఉపాధ్యాయ బదిలీలకు సంబంధించిన ప్రాథమిక సీనియారిటి జాబితాలపై అభ్యంతరాలు, ఫిర్యాదుల పరిష్కారానికి మూడు బృందాలను ఏర్పాటు చేస్తూ జిల్లా విద్యాశాఖాధికారి కిరణ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. జూన్ 2వతేదీ వరకు ఈ బృందాలు పనిచేస్తాయి. గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయుల సీనియారిటీ జాబితాలపై అభ్యంతరాలు పరిశీలించి పరిష్కరించేందుకు చీరాల ఉప విద్యాధికారి బి.గంగాధరరావు, తెల్లబాడు జడ్పీ హైస్కూలు హెచ్‌ఎం ఎం.రమేష్, స్కూల్ అసిస్టెంట్ల అభ్యంతరాల పరిశీలనకు పెట్లూరు జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం కేసీహెచ్.చలపతి, రుద్రవరం హెచ్‌ఎం కె.శ్రీనివాసరావు, చినగంజాం ఎంఈవో బి.అజయ్‌ను నియమించారు. సెకండరీ గ్రేడ్ టీచర్ల అభ్యంతరాల పరిశీలన బాధ్యతను తాళ్లూరు హెచ్‌ఎం శ్రీనివాసరావు, తెల్లబాడు హెచ్‌ఎం ఎం.రమేష్, మల్లంపేట హెచ్‌ఎం పీఏ.పద్మనాభరావు, సుంకేశుల హెచ్‌ఎం కృష్ణప్రసాద్‌కు అప్పగించారు. ఆయా సబ్జెక్టులకు సంబంధించిన సెక్షన్ అసిస్టెంట్లు వీరికి సహాయకారులుగా వ్యవహరిస్తారు. ఈ మూడు టీంలు బదిలీల ప్రాథమిక సీనియారిటీ జాబితాలపై వచ్చిన అభ్యంతరాలను పరిశీలించి పరిష్కరిస్తారు. ఎడిట్ ఆప్షన్‌ను ఉపయోగించి పాయింట్లలో మార్పులు,చేర్పులు చేస్తారు.

40 అభ్యంతరాలు పరిష్కారం

గ్రేడ్-2 హెచ్‌ఎంల సీనియారిటీ జాబితాపై 40 మంది హెచ్‌ఎంలు అభ్యంతరాలు తెలిపారు. అవన్నీ ప్రధానంగా పాయింట్లు కలవకపోవడంపైనే వచ్చాయి. వాటిని పరిశీలించి పరిష్కరించి ఆ మేరకు ఆన్‌లైన్‌లో మార్పులు చేశారు. హెచ్‌ఎం బదిలీలకు మొత్తం 111 ఖాళీలను ప్రకటించారు. అభ్యంతరాల పరిశీలన, పరిష్కారం ముగియడంతో బదిలీల తుది సీనియారిటీ జాబితా సోమవారం రాత్రికి విడుదలవుతుందని డీఈవో కిరణ్‌కుమార్ తెలిపారు. పీఎస్ హెచ్‌ఎంలు 149 మంది, 149 మంది ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలు బదిలీకి దరఖాస్తులు చేశారు. వీటి మొదటిదశ పరిశీలన సంబంధిత ఎంఈవో స్థాయిలో జరిగింది. రెండవ దశ స్థానిక డీఆర్‌ఆర్‌ఎం హైస్కూల్‌లో సోమవారం ముగిసింది.

సమయపాలన తప్పనిసరి

ఎక్సైజ్ కమిషనర్ విజయ

పర్చూరు, మే 26 (ఆంధ్రజ్యోతి) : మద్యం దుకాణాల వద్ద సమయపాలన తప్పనిసరిగా పాటించాలని ఎక్సైజ్‌శాఖ కమిషనర్ కే.విజయ ఆదేశించారు. సోమవారం పర్చూరులోని ఎక్సైజ్‌శాఖ కార్యాలయాన్ని ఆమె సందర్శించి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దుకాణాల వద్ద ఎంఆర్‌పీ కంటే అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు సిబ్బంది దుకాణాలను తనిఖీ చేయాలన్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 10 గంటల వరకు మాత్రమే దుకాణాలు తెరిచి ఉంచాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే లెసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అధికారులు భుజంగరావు, శ్రీధర్‌బాబు, పాల్గొన్నారు.

టీడీపీ అభివృద్ధికి కృషి

దివంగత నేత వీరయ్య చౌదరి సతీమణి సుచిత్ర

నాగులుప్పలపాడు, మే 26 : తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి, కార్యకర్తల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తానని దివంగత నేత, మాజీ ఎంపీపీ ముప్పవరపు వీరయ్య చౌదరి సతీమణి, చవటపాలెం ఎంపీటీసీ ముప్పవరపు సుచిత్ర వెల్లడించారు. మండల పరిధిలోని వివిధ గ్రామాల తెలుగుదేశం పార్టీ నాయకులు, గ్రామ పార్టీ అధ్యక్షులు, సర్పంచులు, ఎంపీటీసీలు, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు, కార్యకర్తలతో ఆమె రాజకీయ ప్రవేశ పరిచయ కార్యక్రమం, మహానాడు కార్యక్రమానికి పార్టీ శ్రేణుల సమాయత్త సమావేశం అమ్మనబ్రోలులోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సోమవారం రాత్రి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల పార్టీ అధ్యక్షుడు తేళ్ల మనోజ్ కుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సుచిత్ర మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అంటే వీరయ్య చౌదరికి ఎనలేని అభిమానమన్నారు. ఆశయాలను కొనసాగించనున్నట్లు స్పష్టం చేశారు.

హెల్త్ అసిస్టెంట్ల బదిలీలు

● చీరాలకు చెందిన యూనియన్ నేత వైద్యశాఖ కార్యాలయం వద్ద హడావుడి
● మరో యూనియన్ నేతలు అడ్డుకొనే ప్రయత్నం

ఒంగోలు కలెక్టరేట్, మే 26 (ఆంధ్రజ్యోతి) : వైద్య ఆరోగ్యశాఖలో సీజనల్ వ్యాధులు అధికంగా ఉండే ప్రాంతాలకు వర్క్ అడ్జెస్ట్‌మెంట్ కింద హెల్త్ అసిస్టెంట్లకు సోమవారం రాత్రి స్థానిక కలెక్టరేట్‌లోని వైద్య ఆరోగ్యశాఖలో బదిలీల ప్రక్రియ జరిగింది. ప్రభుత్వ ఆదేశాలతో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మెరిట్ జాబితా ప్రకారం కౌన్సెలింగ్ నిర్వహించి వర్క్‌అడ్జెస్ట్‌మెంట్ బదిలీలు చేశారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని 97 మంది హెల్త్‌అసిస్టెంట్లకు ఈ ప్రక్రియను చేపట్టారు. వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారుల నుంచి క్లారిఫికేషన్ తీసుకున్న అనంతరం ఈ బదిలీలు చేపట్టారు. ఉమ్మడి జిల్లాలో డెంగ్యూ, మలేరియా తదితర రకాల వ్యాధులు అధికంగా నమోదయ్యే ప్రాంతాలకు హెల్త్ అసిస్టెంట్లను బదిలీ చేశారు. వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో హెల్త్ అసిస్టెంట్ల బదిలీలపై చీరాలకు చెందిన ఒక యూనియన్ నాయకుడు వైద్యశాఖ కార్యాలయం వద్ద హడాహుడి చేశారు. తానే ఈ బదిలీల ప్రక్రియను చేపడుతున్నట్లుగా వ్యవహరించడంతో బాపట్ల ప్రాంతానికి చెందిన మరో యూనియన్ నాయకుడు అడ్డుకొనే ప్రయత్నం చేశారు. దీంతో కొంత సేపు వైద్యశాఖ కార్యాలయం వద్ద గందరగోళం నెలకొంది. చీరాలకు చెందిన యూనియన్ నాయకుడికి వైద్యశాఖ కార్యాలయంలో ఏం పని ఉందని ప్రశ్నించే పరిస్థితి ఏర్పడింది. ఆ యూనియన్ నాయకుడి హడాహుడితో హెల్త్ అసిస్టెంట్లకు అర్థం కాని పరిస్థితి ఏర్పడింది. దీంతో వెంటనే ప్రభుత్వ గుర్తింపు పొందిన బాపట్లకు చెందిన మరో యూనియన్ నాయకుడు అక్కడకు వచ్చి ఈ విషయాన్ని ప్రశ్నించారు. దీంతో అక్కడ కొంత సేపు రగడ నెలకొంది.

అవీ..ఇవీ..

దేవాలయం ముందు మందు పార్టీలు

● ఆందోళనలో ముక్తేశ్వరం ప్రజలు

బల్లికురవ. మే 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముక్తేశ్వరం గ్రామంలోని శివాలయం ముందుభాగంలో జోరుగా మందు పార్టీలు జరుగుతున్నాయి. రాత్రులు కొందరు యువకులు మద్యం సీసాలు తెచ్చుకొని అక్కడే పార్టీలు చేసుకొని సీసాలను అక్కడే పడేసి వెళుతున్నారు. దేవాలయానికి వెళ్లే భక్తులు ఈ సీసాలు చూసి ఆందోళన చెందుతున్నారు. ముక్తేశ్వరం గ్రామంలో ఎంతో ప్రసిద్ధి చెందిన ముక్తి లింగేశ్వర స్వామి దేవాలయం కొండపై భాగంలో ఉంది. ఈ దేవాలయానికి వెళ్లే రోడ్డు ముందుభాగంలోని చెట్ల కింద కొందరు రాత్రి పగలు అనే తేడా లేకుండా మద్యం సేవిస్తున్నారు. దేవాలయానికి వచ్చే భక్తులు వీటిని చూసి అవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరువ్యక్తులు ఇక్కడే జూదం ఆడుతున్నారని వాపోతున్నారు. అధికారులు, గ్రామ పెద్దలు వెంటనే శివాలయం వద్ద మద్యం సేవించకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



శివాలయం ముందువైపు పడవేసిన ఖాళీ మందు సీసాలు

అమృతలూరుకు ఎస్సై బదిలీ

అద్దంకి, మే26(ఆంధ్రజ్యోతి):అద్దంకి పోలీస్‌స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న రవితేజ అమృతలూరుకు బదిలీ అయ్యారు. సీఐ స్టేషన్‌హౌస్ ఆఫీసర్‌గా ఉన్న అద్దంకి పోలీస్ స్టేషన్‌లో సీఐతో పాటు రెండు ఎస్సై పోస్టులు ఉన్నాయి. నెల రోజుల క్రితం ఖాదర్‌బాషా బదిలీ కాగా, సోమవారం రవితేజ బదిలీ అయ్యారు. రెండు పోస్టులలో ఇంకా ఎవరిని నియమించలేదని సిఐ సుబ్బరాజు తెలిపారు.

రోడ్డుపై ఇద్దరు యువకుల ఘర్షణ

● అదుపులోకి తీసుకున్న పోలీసులు

● ఇద్దరూ పాత కేసుల్లో నిందితులే



ఘర్షణ సమయంలో గుమికూడిన స్థానికులు

అద్దంకి, మే26(ఆంధ్రజ్యోతి): అద్దంకి పట్టణంలోని పాత బస్టాండ్ సెంటర్‌లో పొట్టిశ్రీరాములు బొమ్మ వద్ద సోమవారం ఇద్దరు యువకులు ఘర్షణ పడ్డారు. వీరిలో ఒకరికి గాయాలయ్యాయి. దీంతో స్థానికులు పెద్ద ఎత్తున గుమికూడారు. దీంతో సమీపంలో విధులలో ఉన్న పోలీసులు అక్కడకు చేరుకొని ఇద్దరిని అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఇద్దరు యువకులు ముండ్లమూరు మండలానికి చెందిన వారే కాగా పలు పాత కేసులలో వీరు నిందితులుగా ఉన్నట్లు విచారణలో తేలింది.. వీరిలో ఒకరు వినుకొండ ప్రాంతంలో బ్రేక్‌ప్రాంతంలో బ్రేక్ ఇన్‌స్పెక్టర్‌ను అని బెదిరించిన వ్యక్తి గా గుర్తించారు. మరొకరు పాత కేసులలో కోర్టుకు హాజరుకాకుండా తప్పించుకు తిరుగుతున్నట్లు తేలింది.

వాహనచోదకులకు హెల్మెట్ తప్పనిసరి



హెల్మెట్ లేనివారికి కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ సుబ్బారావు

అద్దంకి, మే 26 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనచోదకులు హెల్మెట్ తప్పనిసరిగా దరించాలని సీఐ సుబ్బరాజు అన్నారు. అద్దంకి పట్టణంలోని భవానిసెంటర్‌లో సోమవారం సాయంత్రం హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనదారులకు సీఐ సుబ్బరావు కౌన్సెలింగ్ ఇచ్చారు. తమ వెంట ఖచ్చితంగా వాహనాలకు సంబంధించి పత్రాలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలన్నారు.

పొగాకు కొనుగోళ్లపై కదలిక

● ప్రభుత్వ ఆదేశాలతో కదిలిన యంత్రాంగం ● పర్చూరులో కంట్రోల్ రూమ్ ఏర్పాటుకు ఆదేశం

పర్చూరు, మే 26 (ఆంధ్రజ్యోతి) : కొనుగోళ్లు జరగక నైరాశ్యంలో ఉన్న పొగాకు రైతులను ఆదుకొనేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాలతో రాష్ట్ర వ్యవసాయశాఖ, విద్యుత్‌శాఖ మంత్రులు స్థానిక ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు నేతృత్వంలో ఇటు పొగాకు కంపెనీల ప్రతినిధులు, రైతులతో ముఖాముఖి నిర్వహించారు. మంత్రులు, ప్రజాప్రతినిధులు, కంపెనీ ప్రతినిధుల ఆధ్వర్యంలో ధరను కూడా నిర్ణయించి సమగ్ర సమాచారాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు తీసుకుపోయారు. దీంతో త్వరిత గతిన కొనుగోలు జరిగేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీచేశారు. దీంతో పొగాకు కొనుగోళ్లపై అడుగులు పడుతున్నాయి. ఇప్పటికే వ్యవసాయశాఖ అధ్వర్యంలో రైతుల వద్ద ఉన్న నిల్వల వివరాలను ప్రభుత్వ ప్రత్యేక యాప్‌లో రైతు భరోసా కేంద్రం సిబ్బంది నమోదు చేశారు. బ్లాక్ బర్లీ పొగాకు పంట వేగవంతంగా కంపెనీలు కొనుగోలు చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీచేశారు. కొనుగోళ్ల విషయంలో వ్యవసాయశాఖ, మార్క్‌ఫెడ్‌ను భాగస్వామ్యం చేస్తూ కలెక్టర్ బాధ్యతలు అప్పగించారు. కంపెనీలు కొనుగోలు చేసిన పొగాకును నిల్వచేసుకునే విధంగా గోడౌన్‌లను కూడా గుర్తించాలన్నారు. దీనికి సంబంధించి పర్చూరులో కంట్రోల్ రూంతోపాటు, టోల్‌ఫ్రీ నెంబరు రైతుల కొరకు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. పొగాకు కొనుగోళ్లపై ప్రజా ప్రతినిధులు, అధికారుల పర్యవేక్షణ ఉంటుందన్నారు.



పర్చూరు ప్రాంతంలో అమ్మకానికి సిద్ధం చేస్తున్న పొగాకు మండెలు

వాగులో గల్లంతైన యువకుడు మృతి

మృతదేహాన్ని వెలికి తీసిన ఫైర్ సిబ్బంది

పర్చూరు, మే 26 (ఆంధ్రజ్యోతి) మే 26: పర్చూరువాగులో యువకులు గల్లంతైన ఘటన సోమవారం చోటుచేసుకుంది. ఇంటి నుంచి బహిర్భూమికి అని వెళ్లిన యువకుడు జొన్నలగడ్డ మోహన్ కుమార్(24) ఎంత సేపటికీ రాకపోవడంతో కుంటుంబ సభ్యులు బంధువులు వాగువద్దకు వెళ్లి వెతికారు. గట్టుమీద బైక్ ఉండటంతో వాగులో పడి ఉంటాడని ఆందోళనకు గురయ్యారు. యువకుడు వాగులో గల్లంతయ్యాడన్న వార్త తెలుసుకున్న కాలనీ వాసులు పెద్ద ఎత్తున ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతుని తండ్రి నాగరాజు నుంచి అందిన సమాచారం మేరకు ఎస్సై మాల్యాద్రి, రెవెన్యూ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని చీరాల ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. ఫైర్ సిబ్బంది వాగును గాలింపు చర్య లు చేపట్టారు. ఎట్టకేలకు మృతదేహాన్ని గుర్తించి వెలికితీశారు. అనంతరం పోస్టు మార్టం నిమిత్తం పర్చూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

పర్చూరు ఇందిరా కాలనీలో విషాదం

వాగులో ప్రమాదవశాత్తు జారిపడి యువకుడు మృతి చెందడంతో పర్చూరు అంబేద్కర్ కాలనీలో విషాదఛాయలు అలముకున్నాయి. చేతికి అందివచ్చిన కుమారుడు ఇలా అకాల మృతి చెందడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.

కుటుంబ కష్టాలు వర్ణనాతీతం..

తండ్రి నాగరాజు ఆర్టీటీసీ గ్యాలరీలు ఉద్యోగం చేస్తున్నాడు. ప్రస్తుతం ఇతను పక్షవాతంతో బాధపడుతున్నాడు. రెండో కుమారుడు ఇటీవల జరిగిన ప్రమాదంలో కాలువిరిగి మంచంలో ఉన్నాడు. అనారోగ్య సమస్యలు, కుటుంబ కష్టాలు వేదిస్తున్న తరుణంలో ఇలా చేతికి అందివచ్చిన కుమారుడు మృతి చెందడం కుటుంబాన్ని తీవ్ర దుఖంలోనికి నెట్టింది.



వాగువద్దకు పెద్ద ఎత్తున చేరుకున్న ప్రజలు ,మోహన్ కుమార్ (ఫైల్)

మహానాడుకు బయలుదేరిన తెలుగు తమ్ముళ్లు

పంగులూరు, మే 26(ఆంధ్రజ్యోతి): టీడీపీ మండల నేతలు కడపలో మూడు రోజుల పాటు జరిగే మహానాడుకు సోమవారం బయలు దేరారు. ఆరు ప్రత్యేక వాహనాలలో వివిద గ్రామాలకు చెందిన 30 మంది టీడీపీ నాయకులు కార్యకర్తలు మహానాడుకు తరలి వెళ్లారు. టీడీపీ మండల అధ్యక్షుడు రావూరి రమేష్, నాయకులు కుక్కపల్లి ఏడుకొండలు, చింతల సహదేవు డు, నియోజకవర్గ ఎస్సీసెల్ అధ్యక్షుడు వరపర్ల సుబ్బా రావు, గుడిబండ్ల ఆదిరెడ్డి, జాగర్ల మూడి సుబ్బారావు, రేణంగివరం మాజీ సర్పంచ్ అవ్వారు పూడి ఏసోబు, బీసీ నాయకులు దాసరి హనుమంతరావుతో పాటు మరికొందరు నాయకులు, కార్యకర్తలు మహానాడుకు తరలివెళ్లారు.



మహానాడుకు బయలుదేరిన టీడీపీ నేతలు

బుచ్చయ్యను కలిసిన టీడీపీ నేతలు

అద్దంకి,మే26(ఆంధ్రజ్యోతి): కడపలో మూడు రోజుల పాటు జరిగే మహానాడు కార్యక్రమాలలో పాల్గొనేందుకు వెళ్తూ సోమవారం మధ్యహ్నం రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అద్దంకి సమీపంలోని ఓ వెంచర్ వద్ద గెస్ట్ హౌస్ వద్ద ఆగారు. కొద్దిసేపు విశ్రాంతి తీసుకొని వెళ్లారు. ఈ సందర్భంగా అద్దంకి పట్టణానికి చెందిన వీవీఆర్ ట్రావెల్స్ అధినేత విప్పర్ల పవన్, వీరాంజనేయులు, గూడూరి రామకృష్ణ తదితరులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి ని కలిశారు.



బుచ్చయ్య చౌదరితో మాట్లాడుతున్న స్థానికులు

ఇంకొల్లు- పర్చూరు రోడ్డుకు నిధుల మంజూరుపై హర్షం

పూసపాడు వంతెన వద్ద కూటమి నాయకుల చిత్రాలకు పాలాభిషేకం

ఇంకొల్లు, మే 26,(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని టీడీపీ మండల అధ్యక్షుడు నాయుడు హనుమంత రావు అన్నారు. ఇంకొల్లు- పర్చూరు ఆర్అండ్ బీ రహదారికి టీడీపీ కూటమి ప్రభుత్వం రూ.24 కోట్లు మంజూరు చేయడంపై ఇంకొల్లు,పర్చూరు,కారంచేడు మండలాల టీడీపీ నాయకులు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇంకొల్లు మండల పరిధిలోని పాత మద్రాసు రహదారిలో వంకాయలపాడు సమీపంలోని అడ్డరోడ్డు వంతెన వద్ద సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి జనార్ధన్‌రెడ్డి, పర్చూరు శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కూటమి ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వం నుంచి నేటి వరకు ఈ రహదారిలో ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఈ రహదారిలో ప్రజలు పడుతున్న కష్టాలను ప్రభుత్వం దృష్టికి పలుమార్లు తీసుకెళ్లి రోడ్డు నిర్మాణానికి నిధుల కేటాయింపుకు కృషి చేయడం అభినందనీయమన్నారు. గ్రామాలలో ప్రజలు సైతం నిధుల మంజూరుపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఇంకొల్లు, పర్చూరు, కారంచేడు మండల అధ్యక్షులు నాయుడు హనుమంతరావు, షేక్ షంషుద్దీన్, శ్రీహరి, కరి శ్రీనివాసరావు, బేతపూడి శ్రీనివాసరావు, పేర్ని బాపయ్య, కరణం రమేష్, శ్రీనివాస రావు, మీరావలి, రమాదేవి, నాగేంద్రమ్మ, వీరాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.



పాలాభిషేకం చేస్తున్న టీడీపీ నేతలు

వెంకట సుబ్బారావుకు విశ్వకర్మ లెజెండ్ అవార్డు

పంగులూరు, మే 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముప్పవరం గ్రామానికి చెందిన సిద్దు వెంకట సుబ్బారావుకు విశ్వకర్మ లెజెండ్ అవార్డు లభించింది. హైదరాబాద్ బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ 9వ వార్షికోత్సవం ఆదివారం నిర్వహించారు. వ్యవస్థాపక ఛైర్మన్ విశ్వనాధుల పుష్పగిరి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వెంకటసుబ్బారావు తెలంగాణ క్రైంబ్రాంచ్ అసిస్టెంట్ కమిషనర్ కిరణ్‌కుమార్ ద్వారా ఈ అవార్డు అందుకున్నారు. సామాజికపరంగా, వృత్తిపరంగా వెంకట సుబ్బారావు అందించిన సేవలకు గుర్తింపుగా ఈ అవార్డు అందచేశారు.



అవార్డు అందుకుంటున్న వెంకటసుబ్బారావు

ప్రత్యేక అవసరాలు కలిగిన వారి పిల్లల సర్వే

ఇంకొల్లు,మే 26,(ఆంధ్రజ్యోతి) : మండలంలోని ప్రత్యేక అవసరాలున్న 0-18 వయస్సులోపు వివిధ రకాల మానసిక, శారీరక దివ్యాంగులైన వారి పిల్లలను గుర్తించడం కోసం సర్వే నిర్వహించనున్నట్లు ఎంఈవో శ్రీనివాసరావు తెలిపారు. వారి వివరాలు సర్వేలో తెలియజేసి నమోదు చేయించుకొని ప్రభుత్వం నుండి వచ్చే రాయితీలను సంక్షేమాలను పొందాలని సూచించారు. తద్వారా వారి దైనందన జీవితానికి అభివృద్ధి తోడ్పాటు అందించడం జరుగుతుందన్నారు. అటువంటి ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల పేర్లను వారి తల్లిదండ్రులు తప్పక నమోదు చేయించుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు 9014961616 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

స్వచ్ఛగ్రామాలకు ప్రజలు సహకరించాలి

బల్లికురవ. మే 26 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛ గ్రామాలగా అభివృద్ధి చేసుకొనేందుకు ప్రజలు సహకరించాలని పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని ఎంపీడీవో కార్యాలయ ఏవో పాండురంగస్వామి కోరారు. కలెక్టర్ ఆదేశాల మేరకు అన్ని గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టేందుకు గ్రామ సభలను అధికారులు నిర్వహిస్తున్నారు. వల్లాపల్లి గ్రామంలో జరిగిన గ్రామసభలో ఏవో మాట్లాడారు. రోడ్ల వెంబడి ఎరువుల దిబ్బలు, చెత్తవేయకుండా ప్రజలు సరైన అవగాహనతో ముందుకు వెళ్లాలన్నారు. పంచాయతీల తరపున అన్ని గ్రామాలలో పారిశుధ్య పనులు చేపడుతున్నామన్నారు. రాజీకయ పార్టీల నేతలు కూడా ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అనీల్, టీడీపీ నాయకులు చింతల రామారావు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక జాగ్రత్తలు

కొత్తపేట (చీరాల), మే 26 (ఆంధ్రజ్యోతి) : పారిశుధ్య నిర్వహణ, చెత్త సేకరణ విధుల్లో పంచాయతీ కార్యదర్శులు జాగ్రత్తగా ఉండాలని ఎంపీడీవో రాజేష్ ఏఎంసీ ఛైర్మన్ కౌతవరపు జనార్ధనరావు అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సోమవారం వేటపాలెం మండలం కొత్తపేట పంచాయతీ కార్యాలయంలో మండలస్థాయి గ్రామసభ నిర్వహించారు. ఈసందర్భంగా పారిశుధ్యంపై గ్రామ ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అలాగే సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి రమేష్ సిబ్బంది పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్‌లో పనిచేస్తున్న ఆపరేటర్‌కు అస్వస్థత

బల్లికురవ, మే 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వల్లాపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో పనిచేస్తున్న షిఫ్ట్ ఆపరేటర్ కె.బ్రహ్మయ్య సోమవారం విధులలో ఉండగా ఫిట్స్ వచ్చి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. వెంటనే గమనించిన తోటి ఉద్యోగులు బల్లికురవ 108లో చికిత్స కోసం చిలకలూరిపేట వైద్యశాలకు తరలించారు. కొమ్మినేనివారిపాలెం గ్రామానికి చెందిన బ్రహ్మయ్య వల్లాపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో పనిచేస్తున్నాడు.

వీవోఏగా నియమించి న్యాయం చేయండి



తహసీల్దార్ సింగారావుకు వినతిపత్రం అందజేస్తున్న మీరాబీ

పంగులూరు, మే 26(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన పంగులూరు - 2 గ్రామైక్య సంఘం వీవోఏగా పనిచేస్తున్న తనను నిబంధనలకు విరుద్ధంగా తొలగించారని, తనను తిరిగి నియమించాలని, నందవరపు మీరాబీ స్థానిక తహసీల్దార్ సింగారావుకు సోమవారం వినతి పత్రం అందజేశారు. 13 ఏళ్లగా వీవోఏగా డ్వాక్రా సంఘ మహిళలకు సేవలందించానని తెలిపారు. తాను ఎలాంటి అవకతవకలకు పాల్పడలేదని తహసీల్దార్‌కు వివరించారు. మీరాబి వెంట స్థానిక సీపీఎం నేత వినోద్‌బాబు, పలువురు డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

గాలులకు విరిగిన విద్యుత్‌స్తంభం



హోటల్ పంచపై పడిన విద్యుత్ స్తంభం

కొత్తపాలెం (చీరాల), మే 26 (ఆంధ్రజ్యోతి) : చీరాల పరిధిలో ఆదివారం అర్ధరాత్రి కుండపోత వర్షం కురిసింది. ఈక్రమంలో పలు చోట్ల వృక్షాలు నేల వాలాయి. అంతేకాకుండా కొత్తపాలెం పంచాయతీ పరిధిలో ఓ టిఫిన్ హోటల్‌పై విద్యుత్‌స్తంభం విరిగి పడింది. దీంతో హోటల్ రేకులు పూర్తిగా ధ్వంసమయ్యాయి. అయితే ఆ సమయంలో ఎవ్వరూ లేక పోవడంతో ప్రమాదం తప్పింది. వర్షానికి రహదారులు జలమయయ్యాయి. అయితే ఈక్రమంలో విద్యుత్ సమస్యలు నెలకొన్నాయి.

ఒరిగిన విద్యుత్ స్తంభం పునరుద్ధరణ

పంగులూరు, మే 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జనకవరం, కొండమూరు గ్రామాల మధ్య ఒరిగిన విద్యుత్ స్తంభాన్ని విద్యుత్ అధికారులు పునరుద్ధరించారు. ఆదివారం 'ఆంధ్రజ్యోతి'లో 'ఒరిగిన విద్యుత్ స్తంభం' శీర్షికన ప్రచురితమైన వార్తకు విద్యుత్‌శాఖ అధికారులు స్పందించారు. ఏఈ అనిల్‌కుమార్ తన సిబ్బందితో జనకవరం, కొండమూరు గ్రామాల మధ్య చెట్లపై ఒరిగిన విద్యుత్ స్తంభాన్ని తొలగించారు. దాని స్థానంలో మరో స్తంభాన్ని ఏర్పాటు చేయించి పటిష్ట పరించారు. దీంతో ప్రమాదం తప్పిందని ప్రజలు పేర్కొంటున్నారు.



సరిచేసిన విద్యుత్ స్తంభం

తమ్మవరం రోడ్డు పనులు ప్రారంభం



రోడ్డు పనులకు పూజలు చేస్తున్న గ్రామస్థులు

మేదరమెట్ల, మే 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని తమ్మవరం వెళ్లే రోడ్డునిర్మాణ పనులను కాంట్రాక్టు సంస్థ ప్రారంభించింది. సోమవారం తమ్మవరం గ్రామస్థులు రోడ్డు నిర్మాణ పనులను కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. మేదరమెట్ల సబ్‌స్టేషన్ నుంచి మూడు కిలోమీటర్ల పొడవున ఈ రోడ్డు నిర్మించనున్నారు. ఈ రోడ్డు పూర్తిగా గుంటలు పడి రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. ఈ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించిన మంత్రి రవికుమార్‌కు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యాభివృద్ధికి రూ.2 లక్షల సాయం

● కిరణ్ జ్యోతి రీసెర్చ్ ఫౌండేషన్ ద్వారా అందజేత

మేదరమెట్ల, మే 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని దైవాలరావూరులో విద్యాభివృద్ధికి రూ.2 లక్షల సాయాన్ని గ్రామానికి చెందిన యువకులు అందజేశారు. దేసు సూర్యనారాయణ, జయలక్ష్మి దంపతుల కుమారులు వెంకటేశ్వరరావు, అనీల్ కుమార్‌లు తమ తల్లిదండ్రుల పేరుతో గ్రామంలో విద్యాభివృద్ధి చేయడానికి కిరణ్ జ్యోతి రీసెర్చ్ ఫౌండేషన్‌కు రూ.2 లక్షల విరాళం అందజేశారు. ఈ మొత్తాన్ని ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి దినిపై వచ్చే వడ్డీని పేద విద్యార్థులకు అందించాలని ఫౌండేషన్ ట్రస్టీ కందెపు రాజశేఖర్‌ను కోరారు. గ్రామంలో విద్యాభివృద్ధికి విరాళం అందించిన యువకులకు కృతజ్ఞతలు తెలపడంతో పాటు ఈ విరాళం ఎంతో మందికి స్ఫూర్తిగా ఉంటుందని రాజశేఖర్ తెలిపారు.